RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in



తెలంగాణ తల్లి



పాఠకులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు 'పరాభవ' నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు. తెలుగు నూతన సంవత్సర ఉగాది సందర్భంగా నేడు పత్రిక కార్యాలయానికి సెలవు. రేపు (శుక్రవారం)సంచిక వెలువడదు. పునఃదర్శనం శనివారం

- తెలంగాణ పత్రిక యాజమాన్యం

ఎడిటర్ : బూర్ల వెంకన్న కరీంనగర్ సంపుటి :17 సంచిక :322 గురువారం , మార్చి 19, 2026, పేజీలు -20 వెల :5/-

## ఉగాది పచ్చడి వైశిష్ట్యం

### కాలంలో మార్పులను తట్టుకునే ఔషధం



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** తెలుగు వారి కొత్త సంవత్సరం ప్రారంభం కానుంది. తెలుగు పంచాంగం ప్రకారం చైత్రమాసం శుద్ధ పాడ్యమి రోజున ఉగాది పండుగతో కొత్త సంవత్సరం ఆరంభం కానుంది. ఈ ఏడాది ఉగాది పండుగ మార్చి 19న వచ్చింది. ఉగాది పండుగ రోజు అందరూ కచ్చితంగా ఉగాది పచ్చడి తినాలని పండితులు చెబుతుంటారు. అసలు ఆ రోజు ఉగాది పచ్చడి ఎందుకు తినాలి. ఎన్ని రోజులు వసంత గమన శుభవేళ.. పచ్చగా కళకళలాడే ప్రకృతి పరంగా.. రేవతి - మిగతా2లో

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం

# ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** మొయినాబాద్ డ్రగ్స్ కేసు పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. దీనిలో తమ ప్రమేయం ఏమీ లేదని ఆయన చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్ వేశాం అని చెప్పారు. 2029లోనే తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్‌రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్లి వారితో సమావేశ మయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు.



## ఇరాన్‌కు వరుస ఎదురు దెబ్బలు


### ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనే మరణం తర్వాత ఇరాన్‌కు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. టెహ్రాన్ పై రాత్రికి రాత్రి జరిపిన దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ - మిగతా2లో



## కొత్త జీవితం ప్రారంభానికి సూచిక

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** ఉగాది పండుగ తెలుగు వారి జీవితాల్లో కొత్త ఆశలను నింపే పండగు సంస్కృతి సంప్రదాయాలకు ధర్మబద్ద జీవన విధానాన్ని ప్రారంభించిన రోజు ఇలాంటి ముఖ్యమైన రోజున మన జీవితాలను ఆధ్యాత్మిక పరంగా.. సేవా పరంగా ఎన్నో కార్యక్రమాలు చేయాలని పండితులు చెబుతున్నారు. చైత్ర శుద్ధ పాడ్యమి తిథి - మిగతా2లో



## ప్రజాసేవలో పదవీ విరమణ లేదు

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదన్నారు. రాజ్యసభ మేధావుల వేదిక అని, ఇక్కడ లభించే జ్ఞానానికి విలువ కట్టలేమని అన్నారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి - మిగతా2లో



## హార్మూజ్ జలసంధి వద్ద భారీ సైనిక చర్య

### అమెరికా తీరు పై మండిపడుతున్న ఇరాన్



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** హార్మూజ్ జలసంధిని మళ్లీ ప్రారంభించేందుకు అమెరికా సైన్యం భారీ సైనిక చర్యకు దిగింది. ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న కఠిన రక్షణ గల మిస్సైల్ స్థావరాలపై 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రే టర్ బాంబులను వరుసగా ప్రయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ స్థావరాల్లో ఉన్న యాంటీ షిప్ క్రూజ్ మిస్సైళ్లు - మిగతా2లో

## రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తుమ్మల నాగేశ్వరరావు



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** రైతులకు తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీపి కబురు అందించారు. ఈ నెల 22వ తేదీన సుమారు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులను సీఎం రేవంత్ విడుదల చేయనున్నారని ఆయన వెల్లడించారు. - మిగతా2లో



## రూ.2400 మద్దతు ధర.. రూ.500 బోనస్

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ, రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ - మిగతా2లో

## బడ్జెట్‌లో బిసిలకు 50శాతం కేటాయింపు

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** జనాభా లో 50 శాతం ఉన్న బీసీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం బీసీల సంక్షేమానికి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఆయన - మిగతా12లో



## మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ - మిగతా2లో



## యూరియా యాప్‌తో రైతులకు నానా యాతన

### అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** కాంగ్రెస్ సర్కారు యూరియా యాప్ పేరుతో రైతులను వేధిస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. రాష్ట్రంలో 50 శాతం మంది రైతుల దగ్గర స్మార్ట్‌ఫోన్‌లు లేవని, - మిగతా12లో



## ఇరాన్‌కు వరుస ఎదురు దెబ్బలు

-మొదటిపేజీ తరువాయి

బుధవారం నాడు ప్రకటించారు. ఇరాన్ సీనియర్ అధికారులు ఎవరినైనా సరే ఎలాంటి అదనపు అనుమతులు అవసరం లేకుండా మట్టుబెట్టాలని మిలిటరీకి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు స్వేచ్ఛనిచ్చినట్టు ఆయన తెలిపారు. అయితే ఇస్మయిల్ ఖతీబ్ మృతి వార్తలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, ఇస్మయిల్ ఖతీబ్ మృతికి ఒక రోజు ముందే ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ సైతం ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఆయనతో పాటు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కోర్(ఐఆర్‌జీసీ) పారామిలిటరీ దళం 'బసిజ్ ఫోర్స్' కమాండర్ గోలం రెజా సోలేమానీ, పెద్ద సంఖ్యలో మిలిటరీ ఉన్నతాధికారులు తమ దాడుల్లో మృతిచెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఆదేశంలోని 100 టార్గెట్లను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇరాన్ తెలిపింది. ఉద్రిక్తతలను తగ్గించే ప్రతిపాదనను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తోసిపుచ్చారు. శాంతికి ఇది సమయం కాదని, ఓటమిని అంగీకరించి నష్టపరిహారం ఇచ్చేంతవరకూ అమెరికా, ఇజ్రాయెల్‌తో శాంతి కుదరదని చెప్పారు.

## హర్మూజ్ జలసంధి వద్ద భారీ సైనిక చర్య

-మొదటిపేజీ తరువాయి

ఈ స్థావరాల్లో ఉన్న యాంటీ షిప్ క్రూజ్ మిస్సైళ్లు హోర్ముజ్ మార్గంలో ప్రయాణించే అంతర్జాతీయ నౌకలకు పెద్ద ముప్పుగా మా రినట్లు తెలిపింది. ఈ దాడులతో ఆ ముప్పును నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. అమెరికా ఇజ్రాయెల్ యుద్ధా నికి ప్రతిగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ప్రభావితమైంది. అనేక దేశాలకు చెందిన చమురు నౌకలు అక్కడే నిలి చిపోవడంతో సముద్ర రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ పరిణామాల మధ్య హోర్ముజ్ భద్రత కోసం సహకరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్ర దేశాలను కోరినా పెద్దగా స్పందన రాలేదు. నాటో దేశాలు కూడా సైనిక సహాయం విషయంలో వెనుకంజ వేశాయి. 'మేము ఎంతోసహాయం చేసినప్పటికీ మాకు మద్దతు రావడం లేదు' అంటూ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఈ దాడికి దిగినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అణు ఆయుధాల అభివృద్ధి దిశగా తాము సాగుతున్నామన్న అమెరికా ఆరోపణల ను ఇరాన్ ఖండించింది. తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకే పరిమితమ ని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ నెలలుగా ఒత్తిడి తీసుకువస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ యుద్ధని ర్ణయాన్ని ముందుకు నెట్టినట్లు అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. బంకర్ బస్టర్ గా పిలిచే ఈ డీప్ పెనెట్రేటర్ బాంబులు భూమిలో లోతుగా దాగి ఉన్న లేదా బలమైన కాంక్రీట్ నిర్మాణాల్లో ఉన్న లక్ష్యాలను ఛేదించి పేలేలా రూపొందించారు. ఒక్కో బాంబు ధర లక్షల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో అమెరికా మరింత భారీ 30 వేల పౌండ్ల బాంబులను కూడా వినియోగించినప్పటికీ, ప్రస్తుత దాడిలో ఉపయోగించినవి. కీలక లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేసే విధంగా ప్రయోగించినట్లు సమాచారం.

## రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తుమ్మల నాగేశ్వరరావు

-మొదటిపేజీ తరువాయి

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు సంక్షేమం ఆగకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేయకపోయినా, రైతుల ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రభుత్వం ఇవాళ్టి నుంచే కొనుగోళ్లను ప్రారంభించిందని తుమ్మల వెల్లడించారు. సిద్దిపేట జిల్లా నర్మెటలో రేపు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబోతున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని చెప్పారు. ఈ సందర్భంగా నర్మెటలో మూడు రోజుల పాటు భారీ వ్యవసాయ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## రూ.2400 మద్దతు ధర.. రూ.500 బోనస్

-మొదటిపేజీ తరువాయి

గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శ్రవణ్, ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. మార్కెట్లకు పోటెత్తిన మక్కలను కొనుగోలు చేయకపోవడం తో రైతన్నకు తిప్పలు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేశారు. మొక్కజొన్నలతో గన్‌పార్క్‌లో నినాదాలు చేసిన గులాబీ పార్టీ నేతలు.. అక్కడి నుంచి కాలినడకన అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. వరి వేయొద్దని, పంట మార్పిడి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పదేపదే చెబితే.. ఆ మాటలు నమ్మి రాష్ట్రంలో రైతులు సుమారు 8 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. తీరా పంట చేతికి వచ్చాక ఆ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతోందని అన్నారు. మొక్కజొన్న మార్కెట్లకు రావడం మొదలై ఇప్పటికే 15 రోజులు అవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొక్కజొన్నకు మద్దతు ధర రూ. 2400 ఉంటే.. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు బయట మార్కెట్లో దళారులకు రూ. 1600 నుంచి 1700లకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పదిహేను రోజులుగా కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం చూస్తుంటే ప్రభుత్వ ఆంతర్యం ఏమిటో అర్థమవుతోందని అన్నారు. పంట అంతా దళారుల పాలైన తర్వాత, ఆ దళారుల దగ్గర ఎక్కువ ధరకు కొని వాళ్లకు మేలు చేయాలని ప్రభుత్వం చూస్తోందా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందా? దళారులకు మేలు చేస్తుందా? అనేది స్పష్టం చేయాలన్నారు. ఒకవైపు మద్దతు ధర లేక నష్టపోతుంటే, మరోవైపు అకాల వర్షాలకు మార్కెట్ యార్డుల్లో, కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న తడిచిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. గత రెండు రోజులుగా కురిసిన వడగండ్ల వానలకు మొక్కజొన్న, మామిడి సహా ఇతర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని పేర్కొన్నారు. బ‌డ్జెట్‌లో పంటల బీమా గురించి గొప్పగా ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం అటు పంటల బీమా అమలు చేయదు, ఇటు ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వదని మండిపడ్డారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర రైతాంగానికి ఇన్ పుట్ సబ్సిడీ అందడం లేదని తెలిపారు. ప్రభుత్వం కేవలం మాటల్లో చెబుతున్నదే తప్ప, ఇప్పటివరకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు సబ్సిడీ నిధులను విడుదల చేయడం లేదని అన్నారు.

# ఉగాది పచ్చడి వైశిష్ట్యం

-మొదటిపేజీ తరువాయి

రేవతి నక్షత్ర ప్రవేశంతో.. చైత్ర శుద్ధ పాడ్యమి గురువారం రోజున ఉగాది పండుగ .. శ్రీ పరాభవ నామ సంవత్సర కాలగమనం ఆరంభమవుతుంది. ఉగాది పచ్చడిని ఒక్కో చోట ఒక్కో విధంగా తయారు చేస్తుంటారు. అందులో తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులను తప్పకుండా ఉండేలా చూస్తారు. ఈ పచ్చడి కోసం చెరకు, అరటి పళ్ళు, మామిడి కాయలు, వేప పువ్వు చింతపండు, జామకాయలు, బెల్లం, జీలకర్ర, మిరపకాయ వంటివి వాడుతుంటారు. ఇన్ని కలిపి చేసిన ఉగాది పచ్చడిని ఒక మహౌషధమని అంటారు పెద్దలు. ఈ ఉగాది పచ్చడిని ఈ పండుగ నుంచి శ్రీరామనవమి వరకూ లేదాచైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ ఉంటే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని. ఆ సంవత్సరమంతా రోగాలేవీ దరిచేరవనే నమ్మకం కూడా ఉంది. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం ఉగాది పచ్చడిని నింబకుసుమ భక్షణం...అశోకకళికా ప్రాశనం అంటారు. రుతువులలో వచ్చే మార్పుల వల్ల వచ్చే రోగాల నుంచి రక్షణగా, ఈ పచ్చడిని ఔషధంగా తీసుకోవడం పూర్వం నుంచే అనవాయితీగా వస్తోంది. పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ అమ్మోరు వంటి అంటురోగాలను దగ్గరకి రానివ్వకుండా కాపాడుతుంది మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉంది. మిరియాలు దగ్గు జలుబు, పైత్యాలను అదుపులో ఉంచుతాయి. బెల్లం రక్తాన్ని శుద్ధి చేస్తుంది. చింతపండు మలబద్దకాన్ని, నీరసాన్ని తగ్గిస్తుంది. ఉప్పు ఎండాకాలంలో వచ్చే హైడ్రేషన్ని తగ్గిస్తుంది. సంవత్సరం అంతా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సమానంగా తీసుకోవాలనే సందేశాన్ని కూడా ఉగాది పచ్చడి ఇస్తుంది. బెల్లం- తీపి అనేది సంతోషానికి, ఉప్పు- జీవితంలో ఉత్సాహానికి... వేప పువ్వు- చేదు బాధ తాలూకు అనుభవాలకు, చింతపండు- పులుపు నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులకు, పచ్చి మామిడి ముక్కల పులుపు- కొత్త సవాళ్లకు.. కారం సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులకు సంకేతం అని చెప్తారు.ఉగాది పచ్చడి ఒక మహౌషధమని పెద్దలు చెబుతుంటారు. ఈ ఉగాది పచ్చడిని శ్రీరామ నవమి వరకూ లేదా చైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ తీసుకోవాలి. అలా 9 లేదా15 రోజుల పాటు ఈ ఉగాది పచ్చడి తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందంటారు. ఉగాది పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ, అమ్మోరు మొదలైన వ్యాధులను దగ్గరకు రానీయదు. మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉన్నది. ఇది కఫము, వాతము, పైత్యాలనే మూడు దోషాలను అదుపులో ఉంచుతుంది. మనకు వచ్చే జబ్బుల్లో చాలా వరకూ వీటివల్లే వస్తాయి.. 'శతాయుర్వ్రజ దేవయ సర్వ సంపత్రాయచ.. సర్వతిష్ట వినాశయ నిబంకదళ బక్షణమ్' అనే శ్లోకం పఠించి ఉగాది ప్రసాదాన్ని స్వీకరించాలి. పంచాంగ శ్రవణం వినాలి. మంచి ఆశయాలతో ముందడుగు వేయాలి. ఆ రోజున (మార్చి 19) పంచాంగాన్ని విన్న పక్షంలో ఏ గ్రహం మనకి అనుకూలంగా లేదో, ఎవరు మనకి సహాయకులో తెలిసి, ఏయే కష్ట నష్టాలో తెలుసుకొని వాటికి సంబంధించిన ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకోగలుగుతామని పండితులు చెబుతున్నారు.

# కొత్త జీవితం ప్రారంభానికి సూచిక

-మొదటిపేజీ తరువాయి

చైత్ర శుద్ధ పాడ్యమి తిథి ఉదయం 6.53 గంగలకు ప్రారంభమవుతుంది. పాడ్యమి తిథి మార్చి 20 ఉదయం 04:54 గంటలకు ముగుస్తుంది. కావున పండితులు తెలిసిన వివరాల ప్రకారం ఉదయం సమయంలో పాడ్యమి తిథి ప్రాబల్యం ఉండటం వల్ల మార్చి 19నే ఉగాది పర్వదినంగా భావిస్తారు. ఉగాది రోజున ప్రాత: కాలంలో కాలకృత్యాలు తీర్చుకొని ఇంటిని శుభ్రం చేసుకోవాలి. తరువాత ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి.. గడపలను పసుపు.. కుంకుమతో అలంకరించాలి. పూజా మందిరంలో కలశాన్ని ఏర్పాటు చేసుకోవాలి. కుటుంబంలో కలశాన్ని ఏర్పాటు చేసుకొనే ఆచారం లేకపోతే అవసరం లేదు. కుల దైవాన్ని ఆవాహన చేసుకోవాలి. ముందుగా కొత్త సంవత్సరానికి సంబంధించిన సంకల్పాన్ని చెప్పుకొని.. గణపతి పూజ చేసుకొని.. విష్ణుమూర్తిని.. లక్ష్మీదేవిని.. పరమేశ్వరునికి పూజలు చేయాలి. షోడసోపచార పూజలు చేసి.. ధూపం.. దీపం.. హారతి తరువాత ఉగాది పచ్చడిని స్వామివారికి నివేదించి ప్రసాదంగా తీసుకోవాలి. ఉగాది పచ్చడిని నైవేద్యంగా సమర్పించడం ద్వారా జీవన తత్వాన్ని గుర్తు చేసుకుంటారు. తరువాత మహానివేద్యం సమర్పించాలి. ఈ విధంగా చేయడం ఎంతో కాలంగా వస్తున్న ఆచారం.. ఇంట్లో పూజ అనంతరం... దగ్గరలోని దేవాలయానికి వెళ్లాలి. ఉగాది రోజున పంచాంగ శ్రవణం వినాలి. ఇది ఒక ప్రాచీన ఆచారమని పండితులు చెబుతున్నారు. పంచాంగం అనేది తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం వంటి 5ముఖ్య అంశాలను వివరిస్తుంది. కొత్త సంవత్సరంలో జరిగే ఖగోళ మార్పులు వాటి ప్రభావాలను తెలియజేస్తాయి. పంచాంగ శ్రవణం ద్వారా ఆ సంవత్సరంలో వర్షపాతం, వ్యవసాయం, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ స్థితిగతులు, సామాజిక శాంతి వంటి అంశాలపై సంక్షిప్త అవగాహన లభిస్తుంది. తరువాత బ్రాహ్మణులకు వస్త్రదానం .. దక్షిణ తాంబూలం ఇచ్చి.. వారి ఆశీర్వాదాలను తీసుకోవాలి. తెలుగు పంచాంగం ప్రకారం మొత్తం 60 సంవత్సరాలు ఉంటాయి. ఇవే పునరావృతమవుతుంటాయి. ఈ ఏడాది 2026 లో మార్చి 19న కొత్త తెలుగు సంవత్సరం పరాభవనామ సంవత్సరం ప్రారంభమవతుంది. పరాభవం అంటే లోపాలను అధిగమించి ఉన్నత స్థితిని చేరుకొనే సమయాన్ని సూచిస్తుందని పండితులు చెబుతున్నారు. కొత్త సంవత్సరంలో ఆధ్యాత్మికత. వినయం.. ఆత్మపరిశీలన.. సేవాగుణాన్ని వృద్ధి చేసే సందేశాన్ని ఇస్తుంది.

# ప్రజాసేవలో పదవీ విరమణ లేదు

-మొదటిపేజీ తరువాయి

హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతల సహకారాన్ని మరువలేమని, సగానికి పైగా తమ జీవితాన్ని పార్లమెంటుకే అంకితం చేశారని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి నేర్చుకోవాల్సినది ఎంతైనా ఉంటుందని సూచించారు.రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు.ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచరణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు. సభ బయట కూడా ఆయన వ్యంగాన్ని , హాస్యాన్ని ప్రదర్శించాలని ఆశించారు. పార్లమెంట్ పక్రియలో ఉన్న ఉభయసభల విధానం గురించి ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ.. ఓ చట్టానికి ఆమోదం దక్కాలంటే రెండో అభిప్రాయం అవసరమని, అలాంటి విధానం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఒక సభలో తీసుకున్న నిర్ణయం.. రెండో ఓపీనియన్ కోసం మరో సభకు వెళ్తుందని, అక్కడ జరిగిన చర్చతో నిర్ణయాత్మక విధానం కొత్త రూపు సంతరించుకుంటుదని ప్రధాని అన్నారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యుల వీడ్కోలు సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం నాడు కాసేపు నవ్వులు పూయించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతూ, గత 54 ఏళ్లుగా ఆయన తనకు తెలుసని, ఆయనతో కలిసి పనిచేశానని చెప్పారు. 'అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ, ఆయన మాతో ప్రేమ సాగించి మోదీని పెళ్లి చేసుకున్నారు' అంటూ చమత్కరించారు. దీంతో సభలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సహా సభ్యులంతా నవ్వులు చిందించారు. దేశానికి సేవ చేయాలనే తపన కలిగిన వారు రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని ఖర్గే అన్నారు. దేవెగౌడ 1996 లోక్‌సభ ఎన్నికల తర్వాత సుమారు ఒక ఏడాది పాటు ప్రధానమంత్రిగా ఉన్నారు. దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతిచ్చింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో హెచ్‌డీ దేవెగౌడ 'జేడీఎస్'తో కాంగ్రెస్ పొత్తు సాగించింది. ఆ కూటమి విజయం సాధించింది. దేవెగౌడ కుమారుడు హెచ్‌డీ కుమారస్వామి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే 2019లో పలువురు కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో కుమారస్వామి ప్రభుత్వం కూలిపోయింది. ఆ తర్వాత బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకుంది. కాగా, రాజ్యసభ సభ్యుల వీడ్కోలు సెషన్‌లో శరద్ పవార్, డీఎంకే నేత తిరుచ్చి శివతో తన అనుబంధాన్ని కూడా ఖర్గే గుర్తుచేసు కున్నారు. అయితే పవార్, తిరుచ్చి శివ తిరిగి రాజ్యసభకు రాబోతున్నారు. ఖర్గే తన ప్రసంగంలో కేంద్ర మంత్రి, ఆర్‌పీఐ(ఏ) చీఫ్ రామ్‌దాస్ అథవాలేపై కూడా ఛలోక్తులు విసిరారు. 'ఆయన ఎప్పుడూ తన కవితల్లో మోదీని పొగుడుతుంటారు. ఆయనకు మరే ఇతర కవితలు తెలియవేమో' అంటూ చమత్కరించారు.

# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దాటవేసే ధోరణిలో సమాధానం ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంతో మంత్రి చెప్పారని తెలిపారు. డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంతో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు.మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ.16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు.

# రంజాన్ ఉపవాసాలతోనే మానవీయ విలువల వికాసం

**– రాయికోడ్ మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్చల్ బాబాగౌడ్.**

తెలంగాణ దినపత్రిక రైకోడ్ మండల్ : మార్చ్ 18–

రంజాన్ ఉపవాసములతో అలౌకిక ఆధ్యాత్మికత, మానవీయ విలువల వికాసం కలుగుతుంది తద్వారా సత్ సమాజ నిర్మాణం జరుగుతుంది అని రాయికోడ్ మండలం. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్చల్ బాబాగౌడ్ అన్నారు. మంగళవారం నాడు రంజాన్ ఉపవాసాల ప్రాముఖ్యత, రంజాన్ నెల సహనం వహించవలసిన నెల, భయభక్తుల నెల ఎవరైతే సహనంతో భయభక్తులతో ఉపవాసాలు పాటిస్తారో వారికి పూర్వం చేసిన పాపాలను సృష్టికర్త మన్నిస్తాడన్నారు. ఆకలి దప్పుల విలువ అనుభవపూర్వకంగా తెలుస్తుందని, తద్వారా పేదవాడి ఆకలి దప్పికలను తీర్చడానికి ప్రయత్నం చేస్తారు అన్నారు. రంజాన్ ఉపవాసాలతో నైతికతతో పాటు ఈ సుగుణాలు, పరోపకార గుణం అలవడుతుందని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మసీదు మొల్సాబ్ గారికి పూలదండలతో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో, మసీదు మొల్సాబ్, గ్రామ మైనారిటీ పెద్దలు సయ్యద్ పాషా పటేల్, మహబూబ్ పటేల్, సత్తార్ ఖాన్, జారత్ ఖాన్, యాదుల్, ఉమ్మర్ ఖాన్, సయ్యద్ బషీర్, అమీర్



అహ్మద్, మామిడిపల్లి గ్రామ మాజీ సొసైటీ చైర్మన్ నజీర్, డాక్టర్ రహీం, సల్మాన్ ఖాన్ దూదేకుల గౌస్, ఇమామ్, సోహైల్ మహమ్మద్, జంగీర్, బిలాల్ ఖాన్, అలాగే మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాజుల ఫణిరాజ్, రాయికోడ్ మండలం. రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం అధ్యక్షులు దాడువై పవన్ కుమార్, కిష్టాగౌడ్, శివప్ప, శేఖర్ గౌడ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్పిజి సరఫరా పై గందరగోళంకృత్రిమ కొరత సృష్టించే వారి పై విజిలెన్స్ దర్యాప్తు జరగాలి






**– పి నర్సింహులు పటేల్.**

తెలంగాణ దినపత్రిక రైకోడ్ మండల్ : మార్చ్ 18:–

దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఎల్పిజి (ఎల్పిజి) గ్యాస్ సరఫరా విషయంలో ఏర్పడుతున్న పరిస్థితులు ప్రజల్లో గందరగోళం మరియు భయాందోళనలు కలిగిస్తున్నాయని తెలంగాణ ఫోరం ఫర్ ఆర్టిఐ అండ్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ , సంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ,పి నర్సింహులు పటేల్, ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రభుత్వాలు ఎల్పిజి సిలిండర్ల కొరత లేదని, అవసరమైనంత సరఫరా అందుబాటులో ఉందని చెబుతున్నప్పటికీ, మరోవైపు కొన్ని ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేవని వినియోగదారులు చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. కొన్ని ఎల్పిజి డీలర్లు గ్యాస్ సరఫరాను ఆలస్యం చేయడం, కొరత ఉందని చెప్పడం వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. అదేవిధంగా సోషల్ మీడియా వేదికలలో గ్యాస్ కొరత పై పలు రకాల సందేశాలు వైరల్ అవుతూ ప్రజల్లో అనవసర భయాందోళనలు కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం గ్యాస్ సరఫరా సమృద్ధిగా ఉందని ప్రకటిస్తున్న సమయంలో స్థానిక స్థాయిలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు కనిపిస్తున్నాయో సంబంధిత అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని పి. నర్సింహులు పటేల్ అన్నారు. ఎక్కడైనా కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయా అనే అంశాన్ని కూడా స్పష్టంగా గుర్తించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు వెంటనే స్పందించి గ్యాస్ సరఫరా వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలపై దర్యాప్తు చేపట్టి నిజానిజాలను వెలికితీయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను భయాందోళనలకు గురిచేసే వ్యక్తులు లేదా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా కోరారు. ప్రజలకు అవసరమైన ఎల్పిజి సిలిండర్లు సకాలంలో అందేలా ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని, సరఫరా వ్యవస్థలో పారదర్శకతను పెంచాలని, పి నర్సింహులు పటేల్ సూచించారు. ప్రజల్లో ఉన్న సందేహాలను తొలగించేందుకు ప్రభుత్వం స్పష్టమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

# 6 గ్యారంటీలు 66 హామీలు, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలి

**– హామీలు వెంటనే అమలు చేయాలని బీజేపీ హెచ్చరిక తహశీల్దార్‌కు వినతిపత్రం**

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, మార్చి 18 (తెలంగాణ పత్రిక)

తెలంగాణ ఉద్యమ కారులు, రైతులు, మహిళలు, పేద ప్రజలు, యువత మరియు సబ్బండ వర్గాల ప్రజలను నమ్మించి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.6 గ్యారంటీలు, 66 హామీలు పేరుతో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, ధర్నాలు, రాస్తారోకోలు వంటి పోరాటాలను ఉధృతం చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయం పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి, కొండాపూర్, లింగంపల్లి, హాఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్ల నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవికుమార్ యాదవ్ బీజేపీ శ్రేణులతో కలిసి అధికారులకు సమస్యలను వివరించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమైందని, ప్రజల ఆస్తులను నష్టపరిచిందని విమర్శించారు. బీజేపీ పోరాటాల ఫలితంగా ప్రజల్లో మార్పు రావడంతో కాంగ్రెస్ పార్టీ "6 అబద్ధాలు 66 మోసాల మేనిఫెస్టో"తో గెలిచిందని అన్నారు. కానీ రెండు సంవత్సరాల పాలన పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటీ సరిగా అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులకు రూ.25 వేల పింఛన్, ప్రభుత్వ ఉద్యోగం, 250 గజాల ఇళ్ల స్థలం, మహిళల పెళ్లికి రూ.లక్షతో పాటు తులం బంగారం, ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఇవ్వాలన్న హామీలు అమలు కాలేదని తెలిపారు. పేదలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీశారని, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల సాయం, కొత్త



రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వలేదని ఆరోపించారు. అలాగే పెన్షన్లు రూ.4000, రూ.6000కు పెంచుతామని చెప్పినా అమలు కాలేదని, ఇంటి స్థలం, రూ.5 లక్షల సాయం కూడా ఇవ్వలేదని అన్నారు. విద్యార్థులకు, యువతకు రూ.5 లక్షల విద్య భరోసా కార్డు, ప్రతి విద్యార్థినికి స్కూటీ, నిరుద్యోగులకు రూ.10 లక్షల వడ్డీ లేని రుణం, రూ.4 వేల నిరుద్యోగ భృతి, ప్రతి జిల్లాకు రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్స్, బస్తీ పబ్లిక్ స్కూల్స్, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ద్వారా రూ.2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తామని చెప్పినా అమలు కాలేదని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బీజేపీ పోరాటాలు కొనసాగిస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, పదాధికారులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు రోగులకు మెరుగైన సేవలు అందించాలి

**– వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి**

**– గంభీరావుపేట సీహెచ్ సీని పరిశీలించిన కలెక్టర్ గరీమ అగర్వాల్**

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మార్చి 18



రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీ హెచ్ సీ)లో కలెక్టర్ బుధవారం పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు ఆసుపత్రిలో ఏ ఏ సేవలు అందుబాటులో ఉన్నాయో వైద్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఇన్ పేషెంట్ వార్డులు, మందులు ఇచ్చే గది, స్టోర్ రూమ్, వ్యాక్సినేషన్ గది, ఎక్స్ రే గది, యునాని హాస్పిటల్, ఆసుపత్రి ఆవరణ అంతా పరిశీలించారు ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా ఉండాలని ఎంపీడీఓకు సూచించారు ఆసుపత్రిలో అవసరమైన మరమ్మత్తు పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, జిల్లా వైద్య అధికారి రజిత, డీసీ హెచ్ ఎస్ రవీందర్, సర్పంచ్ మల్లుగారి పద్మ, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో రాజేందర్, డాక్టర్ సృజన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# బాల్య వివాహాల నివారణే ద్వేయం కావాలి. సర్పంచ్ పాలకి సురేష్.



కోదాడ, మార్చి 18(తెలంగాణ పత్రిక):

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా భేటీ బచావో బేటి పడావో బాల్య వివాహాల నిషేధ చట్టం యొక్క పోస్టల్ ఆవిష్కరణను బుధవారం కోదాడ మండలం దొరకుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పాలకి సురేష్ పోస్టల్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ. అమ్మాయిలు 18 సంవత్సరాలు వచ్చాక మాత్రమే వివాహం చేసుకోవాలని. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల వారికి పుట్టే పిల్లల్లో జన్యుపరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆకాంక్షిస్తూ కోరారు. గ్రామంలో బాల్యవివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని ఎప్పటికప్పుడు అంగన్వాడి టీచర్ల ద్వారా సమాచారం తీసుకొని బాల్యవివాహాల నివారణే ద్వేయం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఐసిడిఎస్ సూపర్వైజర్ డి.రమణ, అంగన్వాడీ టీచర్స్ ఆదిలక్ష్మి, కృష్ణవేణి, అరుణ, నాగమణి, ఏఎన్ఎం మీనా కుమారి, ఆశా వర్కర్లు ఎల్లమ్మ, అరుణ, గ్రామ శాఖ అధ్యక్షుడు పత్తిపాక వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పెద్దలు పాల్గొన్నారు.

# నీళ్ల కోసం కాలువలో రైతుల నిరసన.



కోదాడ, మార్చి 18(తెలంగాణ పత్రిక):

సాగునీరందించి పంట పొలాలను కాపాడాలని రైతులు నిరసన. బుధవారం కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు,నల్లబండగూడెం,ద్వారకుంట,రెడ్లకుంట గ్రామాల రైతులు ఆర్కే మేజర్ కాలువల్లోకి దిగి నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 15 రోజులకు ఒకసారి వంతుల వారీగా నీరు విడుదల చేస్తున్నారని, అయితే ఆ నీరు చివరి ఆయకట్టు వరకు చేరడం లేదని వాపోయారు. మొన్నటి వరకు యూరియా కొరకు అనేక కష్టాలు పడి పంటలు పండిస్తే తీరా పంట చేతికి వచ్చే తరుణంలో ఎండిపోతుంటే దిక్కుతోచడం లేదని రైతులు వాపోయారు. పెట్టిన పెట్టుబడి కూడా దక్కేలా లేదని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లినా తమను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసి తమ పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు గ్రామాల రైతులు జాల శ్రీనివాస్, జాల వెంకన్న, గోపి, తిరపయ్య, ముత్తయ్య, మహేష్, కార్తీక్, సోమయ్య, నగేష్, రాంబాబు, శంకర్, నాగేశ్వరరావు, వేణు, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# కోటగిరిలో రంజాన్ తోపా పంపిణి.



కోటగిరి తెలంగాణ పత్రిక మార్చ్ 18.

కోటగిరి మండల కేంద్రంలోని జరీనా కాలనీలో మసీదు వద్ద పవిత్ర మాసమైన రంజాన్ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరఫున మండల ప్రజా ప్రతినిధులు అధికారులు కలసి పేద కుటుంబాల ముస్లింలకు రంజాన్ తోపాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు సోదరీమణులు ఉపవాసలు పాటిస్తారన్నారు. వారిని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని రంజాన్ సోఫాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండల కేంద్రంలోని మైనార్టీ ప్రజలకు వివిధ గ్రామాల మైనార్టీ కుటుంబాలకు ప్రజాప్రతినిధులకు అధికారులకు ప్రభుత్వం తరఫున ముందుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతునమ్మన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్ మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్ మాజీ ఎంపీటీసీలు కొట్టం మనోహర్ సలీం మాజీ సొసైటీ చైర్మన్ కూచి సిద్దు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి ఆవగిరి రావు పటేల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షాహిద్ హుస్సేన్ జుబేర్ జమీర్ నయీమ్ అధికారులు. తహసిల్దార్ గంగాధర్ మండల ప్రజా పరిషత్ సూపరిడెంట్ శ్రీనివాస్ రెడ్డి పిఓపిఆర్డి ముజాఫర్ బేగ్ మండల మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సంవత్సరాది ఉగాది ఉత్సవాలకు భక్తులకు ఘనస్వాగతం..

**- శివాలయం చైర్మన్ రామిడి శ్రీధర్..**

వీణవంక ప్రతినిధి, మార్చి 18 ( తెలంగాణ పత్రిక).



శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా మార్చి 19 గురువారం రోజున వీణవంక శివాలయం ఉదయం 6-00 నుండి భక్తులకు, గర్భాలయం ప్రవేశం కలదు. శివలింగం పై పాలు, నీల్లు పోయుట పూలు, దళములు పెట్టు కోవడానికి ఆలయ కమిటీ అవకాశం కల్పించడం జరిగింది. కావున భక్తులు అందరూ ఇట్టి కార్యక్రమములో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరు.తదనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది పచ్చడి,భక్ష్యాలు, పులిహోర ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలని, శివాలయం చైర్మన్ రామిడి శ్రీధర్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

## వల్బపూర్‌లో హనుమాన్ ఆలయానికి విరాళం

**- బాన్సువాడ బిజెపి పార్టీ ఇంచార్జ్ కోనేరు శశాంక్.**



కోటగిరి తెలంగాణ పత్రిక మార్చ్ 18.

కోటగిరి మండలంలోని వల్బపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయానికి భారతీయ జనతా పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్ కోనేరు శశాంక్ 25వేల రూపాయల విరాళం మండల బిజెపి పార్టీ అధ్యక్షులు వేముల నవీన్ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కోనేరు శశాంక్ మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణం కొరకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులకు తెలిపారు. అనంతరం హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు ఆలయ నిర్మాణానికి ఆయన వంతు సహాయ సహకారాలు అందించినందుకు గాను కోనేరు శశాంక్‌కు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆంజనేయులు లక్ష్మణ్ సాయిలు విట్టల్ పటేల్ కోటగిరి రుద్రూర్ బిజెపి పార్టీ మండలాల అధ్యక్షులు వేముల నవీన్ హరికృష్ణ గ్రామ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా సాగుతున్న పదవ తరగతి పరీక్షలు




వీణవంక ప్రతినిధి, మార్చి 18 ( తెలంగాణ పత్రిక).

వీణవంక మండల వ్యాప్తంగా జరుగుతున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంత మైన వాతావరణంలో జరుగుతున్నాయి. వీణవంక మండల కేంద్రంతోపాటు, గన్ముకుల, చల్లూరు గ్రామలలో పరీక్ష కేంద్రాల నిర్వహణ పటిష్టమైన పోలీస్ బందోబస్తు నడుమ, పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం తేలికపాటి వర్షం కురిసినప్పటికీ, విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పరీక్షా కేంద్రాలలో అధికారులు జాగ్రత్తలు చేపట్టారు. మండల వ్యాప్తంగా బుధవారం జరిగిన హిందీ పరీక్షకు 315 విద్యార్థులు కాను వీణవంకలో 124 మంది విద్యార్థులు, గన్ముకుల 84 మంది విద్యార్థులు హాజరు కాగా ,మండల వ్యాప్తంగా 314 మంది విద్యార్థులు హాజరు కాగా, ఒక్కరు మాత్రమే గైహాజరయ్యారని అధికారులు తెలిపారు.

## నర్సింగాపూర్ లో గాలివానకు దెబ్బతిన్న మొక్కజొన్న చేనును పరిశీలించిన ఏవో గణేష్..

వీణవంక ప్రతినిధి, మార్చి 18 ( తెలంగాణ పత్రిక).



వీణవంక మండల వ్యాప్తంగా 26 గ్రామాలలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన గాలివానకు మొక్కజొన్న లోకల్ వెరైటీలు స్వల్పంగా నేలకొరిగి రైతన్నకు కొంత నష్టాన్ని మిగిల్చింది. బుధవారం ఉదయం వ్యవసాయ అధికారులు విషయం తెలుసుకున్న వెంటనే, దెబ్బతిన్న మొక్కజొన్న చేనులను క్షుణ్ణంగా పరిశీలించారు. నర్సింగాపూర్ గ్రామాల్లో మొక్కజొన్న గాలివానకు పడిపోయినష్టాన్నిమిగిల్చిందని రైతు పోతరవేన కుమార్ ఆవేదన వ్యక్తపరుస్తూ ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని, సర్వేలు చేపట్టి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఈ క్షేత్ర పరిశీలనలో మండల వ్యవసాయ అధికారి గణేష్, ఏఈఓ గౌతమి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వీణవంకలో ఘనంగా పోచమ్మ బోనాలు

**- గ్రామ సర్పంచ్ దాసారపు సరోజన -రాజేంద్రప్రసాద్..**

వీణవంక ప్రతినిధి, మార్చి 18 ( తెలంగాణ పత్రిక).



వీణవంక మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో బుధవారం గ్రామ సర్పంచ్ దాసారపు సరోజన - రాజేంద్రప్రసాద్ కుటుంబ సమేతంగా, కాలనీవాసులు పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. వీణవంక మండల వ్యాప్తంగా గ్రామ గ్రామాన హిందువులు పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. పోచమ్మ ఉత్సవాల్లో భాగంగా వీణవంక మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో పోచమ్మ బోనాలను కాలనీవాసులు డప్పు చప్పులతో, యాటపోతులతో మహిళలు నూతన వస్త్రాలు ధరించి బోనాలను పసుపు, కుంకుమ, వేప ఆకులతో అలంకరించుకొని, అంగరంగ వైభవంగా ర్యాలీగా బయలుదేరి పోచమ్మ తల్లి ప్రాంగణానికి చేరుకొని, అమ్మవారికి నూతన వస్త్రాలు, నైవేద్యం, కల్లు, బెల్లం శాక, దీప, ధూపాలను సమర్పించి, అమ్మవారికి యాటల పోతులను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. ఉగాది పర్వదినన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం గ్రామదేవతలైన పోచమ్మ తల్లికి బోనంతో, యాటపోతులతో, కొబ్బరికాయ కొట్టి చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురా రోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సకల సంపదలతో తులతూగాలన్నారు.

# వినియోగదారుల సంక్షేమ సంఘం కరపత్రిక ఆవిష్కరణ

**- ఆర్డిఓ శ్రీదేవి**

చందూరు తెలంగాణ పత్రిక మార్చి 18



జాగృతి వినియోగదారుల సంక్షేమ సంఘం చండూర్ వినియోగదారుల హక్కులు-బాధ్యతలు కరపత్రిక ఆవిష్కరించిన ఆర్డీవో వి శ్రీదేవి-మేలుకో వినియో గదారుడా తెలుసుకో మాతృ గర్భంలో రూపుదిద్దుకున్న క్షణం మొదలుకొని మరణాంతం వరకు ప్రతి ఒక్కరూ వినియోగదారుడే వస్తువు సేవలు ఉపయోగిం చుకునే ప్రతి ఒక్కరూ వినియోదారుడే నేటి పోటీ ప్రపంచంలో లభిస్తున్నటువంటి నిత్యవసర వస్తువులు సైన్ ఫ్లూ కంటే భయంకరమైనవి. భారతదేశంలో మొట్ట మొదటిసారిగా వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టం 1986 డిసెంబర్ 24న చేయడం జరిగింది వినియోగదారులు తాము ఖరీదు చేసిన వస్తువులు లేదా సరుకుల విషయంలో లోపాలు ఉన్నట్లయితే వాటిని ఉత్పత్తిదారులకు లేదా అమ్మకం దారులకు విన్నవించి తగుపరిహారాన్ని పొందే హక్కు వినియోగదారులకు ఉన్నది అలాగే వినియోగదారులు పొందే సేవలు సంతృప్తికరంగా లేకపోయినా కొనుగోలు చేసిన సరుకుల్లో లోపాలు ఏర్పడిన తగిన నష్టపరిహారాన్ని పొందే హక్కు ఉంటుంది కావున ఈ విషయాలన్నీ కరపత్రిక రూపంలో తెలియ పరచినాము వినియోగాదారుల అందరికి అవగాహన కల్పించేందుకు మా వంతు ప్రయత్నం ఈ కార్యక్రమంలో తిరందాసు ఆంజనేయులు, గండూరి నరసింహ, తాందారి యాదయ్య, జూలూరి వెంకటేశం, గంజి వెంకటేశం, జెల్లా కన్నెయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

**- నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రామగుండం ఎమ్మార్వో కు వినతిపత్రం.**

గోదావరిఖని మార్చి 18(తెలంగాణ పత్రిక ప్రతినిధి )



ఈ కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షులు గుండెబోయిన భూమయ్య మరియు ఊరగొండ అపర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి పాల్గొని వినతిపత్రాన్ని ఎమ్మార్వో కు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే రెండు సంవత్సరాలు గడిచినా వాటిలో ఇప్పటి వరకు ఏ ఒక్కటి అమలు కాలేదని విమర్శించారు. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు మరియు దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదని పేర్కొన్నారు. మండలంలో రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సమయానికి అందకపోవడంతో అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆసరా పెన్షన్లు అందడం లేదని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. పేదలకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల మంజూరు ప్రక్రియ ఆలస్యం అవుతుందని, భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన దరఖాస్తులు ఇంకా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని తక్షణమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. అదనంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, వీధి దీపాల వంటి సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో ను కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ముసుకుల భాస్కర్ రెడ్డి, సుల్వ లక్ష్మీనరసయ్య,కోడూరి రమేష్, మాదరబోయిన రాకేష్,రామగిరి నరేష్, పాకాల నరసింహారెడ్డి, ఎల్తూరి సరిత, ఎల్తూరి రాజయ్య,అంకరి భరత్, ఆకునూరి రమేష్, కొమురవెల్లి విశ్వనాథ్,ఇరుగు రాళ శివ, ఆలకుంట మహేష్, గోగుల రమేష్,సాయి, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పేరిట కూల్చివేతలు సరైంది కాదు

**- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చ్ 18,(తెలంగాణ పత్రిక)



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో పండుగల సమయంలో అభివృద్ధి పేరిట కూల్చివేతలు సరైంది కాదని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస టాకీస్, మార్కెట్ రోడ్, రైల్వే స్టేషన్ రోడ్, బస్టాండ్ ప్రాంతాల్లో వ్యాపారస్తులకు ఎలాంటి నోటీస్ లు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు అభివృద్ధి పేరుతో కూల్చివేతలు జరపడాన్ని అయన పరిశీలించారు. పండుగ ముందు ఇలాంటి పనులు చేపట్టడంను బీజేపీ ఖండిస్తుందన్నారు. నగర అభివృద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం హిందూ పండుగల సమయంలో కూల్చివేతలు జరిపి, ప్రజలను ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. టెండర్ ఖరారు కాకుండానే పనులు మొదలు పెట్టడం తెలంగాణ రాష్ట్రంలో ఓక మంచిర్యాలలోనే జరుగుతుందని ఆరోపించారు.పండుగల అనంతరం పనులు చేపడితే బాగుండేదని తెలిపారు.కూల్చివేతలు వేగంగా చేసిన, పనులు వేగవంతంగా చేసి వ్యాపారస్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు....

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక)18/03/26



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇఫ్తార్ విందు కార్యక్రమాలలో భాగంగా ఐజ మున్సిపాలిటీలోఈరోజు ఏఐసీసీ కార్యదర్శి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సంపత్ కుమార్ ఆదేశానుసారం మేకల పేట నల్ల మసీదు నందు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందునకు సింగిల్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి ,కౌన్సిలర్ ఎస్ మద్దిలేటి ,సంతోషమ్మ మైనర్ బాబు, రాధాకృష్ణ ,యుగేందర్, మహబూబ్ బాషా ,మాజీ కౌన్సిలర్ కాజా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవేంద్ర, ఫిరోజ్ ,మాల మల్లికార్జున్, డాన్ వీరన్న, నంద్యాల శీను, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ షాలు, కాంగ్రెస్ పార్టీ యూత్ టౌన్ ప్రెసిడెంట్ డి సూర్యచంద్ర ,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కురువ విరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు అద్దాలు పంపిణీ

జగిత్యాల, మార్చి 18, (తెలంగాణ పత్రిక ):



జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినారు. గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 63 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ గుజ్జుల సుజాత, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 2500 మంది దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించగా, మొదటి దశలో 740 మందికి కంటి అద్దాలు అందించామని అధికారులు తెలిపారు. గొల్లపల్లి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా దృష్టిలోపం ఉన్న చిన్నారులకు అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ, స్కూల్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దృష్టి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, దశలవారీగా కంటి అద్దాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం డీపీఓ రవీందర్, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ తిరుపతి, వైద్యాధికారి శ్రీకాంత్, సూపర్వైజర్లు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ,స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ,డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కలకు ఉగాది పండుగ సందర్భంగా మట్టి పాత్రలు అందజేసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్

గోదావరిఖని మార్చి 18( తెలంగాణ పత్రిక ప్రతినిధి)



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రామగుండం శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాగూర్ శాసన సభ ఆవరణ లో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ,స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ,డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కలకు ఉగాది పండుగ సందర్భంగా మట్టి పాత్రలు అందజేయడం జరిగింది. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ పురస్కరించుకొని "మట్టి పాత్రలు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి-కుల వృత్తులను ప్రోత్సహించండి" నినాదంతో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కు ఉగాది మట్టి పాత్రలను అందించడం జరిగిందని అందులో ఉగాది పండగ కి ఉపయోగపడే మట్టి కుండా, గ్లాస్ లు , జగ్గు ,బౌల్, షడ్రుచులు ఉండే మామిడి కాయలు , వేప పువ్వు , బెల్లం , చింతపండు ,కారం వస్తువులు ఉగాది కిట్ లో అందజేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రజలకు పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడడానికి, పర్యావరణాన్ని రక్షించడానికి మట్టి పాత్రలు ఉపయోగించాలని , ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించడం జరిగింది . మన సంస్కృతి సంప్రదాయాలకు పండగలతో మట్టి పాత్రలు అనువైనవి ,మట్టి పాత్రలు వినియోగాన్ని పెంచి కుల వృత్తులను కాపాడడానికి అందజేయడం జరిగింది. మట్టి పాత్రలు వాడకం తరతరాల సాంప్రదాయం.. దీని వల్ల ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయి అని ఉగాది సందర్భంగా మట్టి పాత్రలు వాడండి ,కుల వృత్తులను కాపాడండి ఆరోగ్యాన్ని రక్షించుకోండి అనే నినాదంతో పండగ జరుపుకోవాలి అని తెలియజేసారు.

# దొరలు, భూస్వాములు ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత మల్లు స్వరాజ్యం

- మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి.

మిర్యాలగూడ ప్రతినిధి//మార్చి 18:(తెలంగాణ ప్రతినిధి):-



భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పీడిత ప్రజల కొరకు అహర్నిశలు పోరాటాలు చేసిన వీరవనిత మల్లు స్వరాజ్యం అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మల్లు స్వరాజ్యం నాలుగో వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో సభ జరిగింది. మొదట ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ భూమి కోసం విముక్తి కోసం మానవాళి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె నిజాముకు రజాకార్లకు భూస్వాములకు వ్యతిరేకంగా తుపాకీ పట్టి పోరాటాలు చేసి పేదలకు భూ పంపిణీ చేసిన ఘనత వారికి దక్కిందన్నారు. వారు సల్పిన పోరాటం ఫలితంగానే 10లక్షల ఎకరాలు పేదలకు పంచడం జరిగిందని వెట్టిచాకిరిని రద్దు చేయించారని అలాంటి పోరాటాలు మరువలేని నేటి యువతకు ఆదర్శమని ఆయన అన్నారు. ఎత్తిన జెండాను దించకుండా ఆ జెండా దేశవ్యాప్తంగా రెపరెపలాడాలని ఆశించిన రోజు రావలని అన్నారు. ప్రపంచ సంపదను కొందరికే దోచుకోవడం కోసం ఈనాటి పాలకులు పెట్టుబడిదారులకు గులా గిరి చేస్తున్నారని అలాంటి పాలకులను పారదోలి పేదలకు న్యాయం చేయాలన్నది ఆమె ఆశయమని వివరించారు. అందు కు ఆమె ఎంచుకున్న మార్గం మార్క్సిజమేనని ఆ సిద్ధాంతం వల్లనే మానవాళికి విముక్తి అని తెలిపారు. మతాల పేరుతో ఈనాటి మతోన్మాదులు చేస్తున్న కుట్రలను వారి రెచ్చగొట్టే ప్రసంగాలను యువత వినకుండా సరైన మార్గాన్ని ఎంచుకోవాలని ఆమె ఆశించారన్నారు. తుది శ్వాస వరకు ఆమె పోరాటాలు చేసిందని ఆ పోరాటాలు సఫలీకృతం అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు మంగారెడ్డి, పట్టణ కార్యదర్శులు గౌతమ్ రెడ్డి, భావండ్ల పాండు, జగదీష్ చంద్ర, పాల్గొన్నారు.

# 334 కొనుగోలు కేంద్రాల ద్వారా యాసంగి ధాన్యం కొనుగోలు

- డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి 2 కోట్ల 18 లక్షల వసూళ్లు
- నాణ్యమైన ధాన్యం కొనుగోలుకు పక్క ప్రణాళిక సిద్ధం.
- పౌర సరఫరాల శాఖ పని తీరు పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిధి మార్చి18 ( తెలంగాణ పత్రిక )



నాణ్యమైన ధాన్యం కొనుగోలుకు పక్క ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పౌర సరఫరాల శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, యాసంగి 2025-26 సీజన్ కు సంబంధించి దాదాపు 4 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 334 సెంటర్ల ద్వారా కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, కోటి 12 లక్షల 59 వేల గన్నీ సంచులు మనకు అవసరం అవుతాయని, కొనుగోలు సెంటర్ లలో మౌలిక సదుపాయాల కల్పన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2024-25 వానాకాలం సంబంధించి 100 శాతము యాసంగీ సంభందించి 93 శాతము , 2025-26 వాన కాలము సంబంధించి 28 శాతము సీఎం ఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) పూర్తయిందని అన్నారు, 2014-15 నుండి 2023-24 సంవత్సరములకు సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బకాయి పడిన 48 రైసు మిల్లులు గుర్తించి గత పది రోజులలో 2 కోట్ల 18 లక్షల రూపాయలు డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుండి వసూలు చేయడం జరిగిందన్నారు. పెండింగ్ బాకాయిలు త్వరితగతిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల చెల్లించాలని, లేని యెడల డిఫాల్ట్ రైస్ మిల్లర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 5 రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులో నమోదు చేసి రెవెన్యూ రికవరీ చట్టం అమలు చేయడం జరిగిందని, మిగిలిన మిల్లుల పై కూడా తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కే. శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం.శ్రీకాంత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ సందర్భంగా నిజంసాగర్‌లో తోఫాల పంపిణీ కార్యక్రమం



జుక్కల్ ఆర్సి / తెలంగాణ పత్రిక మార్చ్ 18

నిజంసాగర్ మండల కేంద్రంలో బుధవారం రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, సర్పంచ్ సుగుణమ్మ పాల్గొని మైనార్టీ ప్రజలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ పవిత్ర మాసంలో పేద కుటుంబాలకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సహాయం చేయడం ఎంతో అవసరమని తెలిపారు. ముస్లిం సోదరులు ఆనందంగా పండుగ జరుపుకునేందుకు ఈ తోఫాలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనీస్ పటేల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి భీమ్రావు, స్థానిక మైనారిటీలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఖప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి



జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక)18/03/26

అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న తన పట్ల అధికారులు అధికారిక కార్యక్రమాలల్లో ప్రోటోకాల్ పాటించటం లేదని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఈ మేరకు ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు ఫిర్యాదు చేసారు. ప్రభుత్వం తరపున చేస్తున్న రంజాన్ తోఫా, ఇఫ్తార్ విందులకు ప్రోట్కాల్ పాటించక పోగా సమాచారం కూడా ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అలాంటి వారి పై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అనంతరం స్పీకర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కు హామీ ఇచ్చారు.

# ఎస్సీ నిరుద్యోగ యువతకు దుకాణాల కేటాయింపులకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.



గోదావరిఖని మార్చి 18( తెలంగాణ పత్రిక ప్రతినిధి)

రామగుండం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద నిర్మించిన దుకాణ సముదాయంలో వ్యాపారం చేసుకునేందుకు ఎస్సి నిరుద్యోగ యువత నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో అద్దె ప్రాతిపదికన ఈ దుకాణాలను కేటాయిస్తారు ఆసక్తి గల అభ్యర్థులు పెద్దపల్లి కలెక్టరేట్లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో మార్చి 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని మరియు ఎంపికైన వారికి ఫోన్ ద్వారా లేదా మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

# సంకల్ప్ వ్యాలీ స్కూల్‌లో ఉగాది సంబరాలు

ముధోల్:18మార్చ్(తెలంగాణ పత్రిక)




మండల కేంద్రమైన ముధోల్ లోని సంకల్ప్ వ్యాలీ పాఠశాలలో బుధవారం ఉగాది పండు గాను పురస్కరించుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉల్లాసం గా ఉత్సాహంగా పండుగ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆరురుచులతో కలిగిన పచ్చడిని తయారు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో పాఠశాల డైరెక్టర్ శేషారావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు మన సంస్కృతి సాంప్రదాయాలను అలవర్చుకోవాలన్నారు. ఉగాది పండుగ విశిష్టతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువు రిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## నవోదయలో సీట్లు సాధించిన చల్లూరు ఆల్ఫ్రెడ్ నోబెల్ హైస్కూల్ విద్యార్థులు

- అభినందించిన ప్రిన్సిపాల్ మనోజ్..



వీణవంక ప్రతినిధి, మార్చి 18 ( తెలంగాణ పత్రిక ).

వీణవంక మండలం చల్లూరు గ్రామంలోని ఇటీవల ప్రకటించిన జవహర్ నవోదయలో చల్లూరు గ్రామానికి చెందిన 5వ తరగతి విద్యార్థులు గుంపుల శ్రేయన్స్, గంజి శివ గణేష్ లు కరీంనగర్ జిల్లాలో 36,54 ర్యాంకులతో నిలిచినందుకు, చల్లూరు అల్ఫ్రెడ్ నోబెల్ హైస్కూల్‌కు గర్వకారణమని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులను ప్రిన్సిపాల్ మనోజ్, ఇన్చార్జి ప్రిన్సిపల్ నిషా- ప్రశాంత్ విద్యార్థులను పుష్పగుచ్ఛలను అందజేసి అభినందించారు. నవోదయ సీటు సాధించడానికి సహాయపడిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## వైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో పంచాగం పుస్తక ఆవిష్కరణ



మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చ్ 18,(తెలంగాణ పత్రిక)

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం శ్రీవైష్ణవ సేవా సంఘం మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ ధరణి మధూకర్ చేతుల మీదుగా నూతన పంచాంగం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీమాన్ గోవర్ధనగిరి అనంతాచార్యులు అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి శ్రీమాన్ ఆచి వెంకట రమణా చార్య, కోశాధికారి కనగర్తి శ్రీనాథా చార్య, రాష్ట్ర కార్యదర్శి కొదుమగుళ్ళ సత్యనారాయణా చార్య, జిల్లాలోని శ్రీవైష్ణవ భాగవతోత్తములు సుమారు 50 మంది పాల్గొన్నారు. పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో మేయర్ ధరణి మధుకర్ ని సన్మానించి, వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాచకొండ గోపాల్ రావు, సూదమల్ల హరికృష్ణ, చిందం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్‌లో ఉమెన్ రిప్రజెంటేటివ్‌గా మల్లెల ఉషారాణి ఏకగ్రీవం

- మహిళా న్యాయవాదుల సేవలో నిబద్ధతతో పనిచేస్తానని ఉషారాణి హామీ






కొత్తగూడెం, మార్చి 18 (తెలంగాణ పత్రిక):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు పరిధిలో నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉమెన్ రిప్రజెంటేటివ్‌గా మల్లెల ఉషారాణి (నిమ్మలూరి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను తోటి న్యాయవాదులు ఘనంగా అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా మల్లెల ఉషారాణి మాట్లాడుతూ, తనను గుర్తించి నమ్మకంతో గెలిపించిన మహిళా న్యాయ వాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్‌లోని మహిళా న్యాయవాదులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, వారికి ఏవైనా సమస్యలు వచ్చినా బాధ్యతగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను సన్మానించిన తోటి న్యాయవాదులు మారపాక రమేష్, అంబటి రమేష్, ఉప్పు శెట్టి సునీల్, వడ్లకొండ హరి మరియు ఇతర న్యాయవాదులందరికీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నిక ద్వారా మహిళా న్యాయవాదుల ప్రతినిధిత్వం బలోపేతం కావడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని న్యాయవాదులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# యువత కోసం “యువ మండల్ వికాస్ అభియాన్”

ఇల్లంతకుంట, మార్చి 18: తెలంగాణ పత్రిక

గ్రామీణ యువతను ఏకం చేసి వారిని అభివృద్ధి దిశగా నడిపించడమే లక్ష్యంగా యువ మండల్ వికాస్ అభియాన్” కార్యక్రమాన్ని నిర్వహించారు. “మై భారత్ రాజన్న సిరిసిల్ల” ఆధ్వర్యంలో శ్రీకృష్ణ యూత్ క్లబ్ సహకారంతో అనంతారం గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐదు రోజుల వ్యవధిలో 50 గ్రామాల్లో అభియాన్ నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో యువజన నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా డివైఓ వెంకట రాంబాబు మాట్లాడుతూ, గ్రామీణ స్థాయిలో యువజన సంఘాలను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువజన సంఘాలు లేని ప్రాంతాల్లో కొత్త సంఘాలను ఏర్పాటు చేసి, వాటిని “మై భారత్” కార్యక్రమాలతో అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో భవిష్యత్తులో మై భారత్ ఆధ్వర్యంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో గ్రామీణ యువత చురుకుగా పాల్గొనే అవకాశాలు మెరుగుపడతాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ అక్కేం నాగరాజు, అనంతారం గ్రామ సర్పంచ్ ఒల్లల రజిత వెంకటేష్, ఉపసర్పంచ్ కదం జయంత్, వార్డు సభ్యులు అక్కేం ఉపేందర్, మల్యాల రాజశేఖర్, బట్టి క్రాంతి, శిలాపురం రమేష్ పాల్గొన్నారు. అలాగే యువజన సంఘ సభ్యులు బొల్లం శ్రీకాంత్, బండారి వెంకటేష్, గోనెపెల్లి



వెంకటేష్, ఒల్లల కృష్ణకుమార్, కదం రాజు, ధరవేణి నాగరాజు, ఒల్లల మధు, చల్ల అంజి, అక్కేం హరికృష్ణ, చొప్పరి అభిరామ్, ఒల్లల శ్రీనివాస్, మల్యాల పరశు రాములు, అరవింద్, వినయ్, స్వామి కిరణ్, అభిషేక్, సురేష్, రాజు, సమీర్, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల భూముల రక్షణకు కురిమెల్ల శంకర్ గళ మెత్తారు అటవీ అధికారుల పై తీవ్ర ఆగ్రహం

కొత్తగూడెం, మార్చి 18 (తెలంగాణ పత్రిక):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చౌక్‌లో ఆదివాసీలు చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష మూడో రోజుకు చేరుకుంది. అశ్వరావుపేట మండలం రామన్నగూడెం రెవెన్యూ గ్రామానికి చెందిన ఆదివాసీలు తమ భూముల రక్షణ కోసం ఆందోళన కొనసాగిస్తున్నారు. ఆదివాసీలు తెలిపిన వివరాల ప్రకారం, రామన్నగూడెం గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 30,36, 39లో కలిపి 1039.39 గుంటల ప్రభుత్వ భూమిని 1981లో మరియు 199498 కాలంలో అప్పటి తహసీల్దార్లు పట్టాలుగా మంజూరు చేశారు. అప్పటి నుంచి ఆ భూముల్లో పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వం అందించే రైతు భరోసా వంటి పథకాల ప్రయోజనాలు కూడా పొందుతున్నామని వారు పేర్కొన్నారు. అయితే ఇటీవల అటవీ శాఖ అధికారులు ఈ భూములను అటవీ పరిధిలోకి చేర్చే ప్రయత్నం చేస్తూ, ఆదివాసీలపై కేసులు నమోదు చేయడం, వేధింపులకు గురిచేయడం జరుగుతోందని వారు ఆరోపించారు. 26-11-2025న సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు అశ్వరావుపేట అటవీ క్షేత్ర అధికారి కార్యాలయం నుంచి రామన్నగూడెం రెవెన్యూ గ్రామ భూములు అటవీ పరిధిలో లేవని స్పష్టంగా తెలిపినప్పటికీ, ఇప్పటికీ వేధింపులు కొనసాగుతున్నాయని ఆదివాసి పోరాట సంఘం అధ్యక్షుడు మడకం నాగేశ్వరరావు తెలిపారు. ఇదిలా ఉండగా, లంకలపల్లి ప్రాంతంలో అటవీ భూమి తగ్గిపోవడంతో రామన్నగూడెం రెవెన్యూ భూమిని అటవీ శాఖ తమ ఆధీనంలోకి తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిరసన దీక్షకు మద్దతుగా కొత్తగూడెం



నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ ఇన్‌చార్జ్ కురిమల శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వమే గతంలో ఆదివాసీలకు పట్టాలు ఇచ్చిన భూములను తిరిగి తీసుకోవడం పూర్తిగా అన్యాయమని మండిపడ్డారు. కొంతమంది కుట్రపూరితంగా వ్యవహరించి ఆదివాసీల భూములు వారికి దక్కకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీల పోరాటం న్యాయసమ్మతమని స్పష్టం చేసిన శంకర్, జిల్లా కలెక్టర్ మరియు రెవెన్యూ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రామన్నగూడెం గ్రామ ఆదివాసీలకు పూర్తి న్యాయం జరిగే వరకు బహుజన్ సమాజ్ పార్టీ వారి పోరాటానికి అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ నిరసనకు వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు మద్దతు తెలుపుతూ ఆదివాసీలకు సంఘీభావం ప్రకటిస్తున్నారు.

## పెద్దపల్లి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





- ఆసుపత్రి నందు ప్రసవాలు అధికంగా జరిగేలా చర్యలు
- ఆస్పత్రిలో మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నందుకు సిబ్బందికి ప్రశంసలు
- వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

పెద్దపల్లి, ప్రతినిధి మార్చి 18 ( తెలంగాణ పత్రిక )

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని, వీటిని ప్రజలు సంపూర్ణంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతా శిశు పేషెంట్స్ కి అందుతున్న సేవలు, రేడియాలజీ విభాగం, గైనకాలజీ విభాగం, లేబర్ రూమ్, ఆప్తామాలజీ విభాగం, ఆర్థోపెడిక్స్ విభాగం, ఫార్మసీ లను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,గర్భిణీ స్త్రీలలో ప్రసవాలు దగ్గర ఉన్న మహిళలను ఈ.డీ.డీ క్యాలెండర్ ద్వారా గుర్తించి వారికి హెల్ప్ డెస్క్ ద్వారా ముందస్తుగానే ఫోన్ కాల్స్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఆసుపత్రిలో పనిచేసే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విధిగా సూపరింటెండెంట్ అనుమతితో మాత్రమే సెలవుల పై వెళ్లాలని అన్నారు. యూ.ఎస్.జి, టిఫా స్కానింగ్, ఓపి సేవల వివరాలు తెలుసుకున్న కలెక్టర్ పలు సూచనలు చేశారు. లేబర్ రూమ్లో శుభ్రత పాటించాలని అన్నారు. మేటర్ నటి వార్డులలో రోగులతో మాట్లాడుతూ మందులు సమయానికి అందుతున్నాయా, నర్సింగ్ సిబ్బంది స్పందన గురించి ఆరాధించిన కలెక్టర్ రోగులనుంచి వచ్చిన స్పందన పై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆఫ్తామాలజి విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫాకో పరికరం పనితీరు గురించి కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ పరికరం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని అవసరమైన ప్రజలు దీని ద్వారా అవసరమైన వైద్య సేవలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నెలకు 60 నుంచి 70 వరకు ఆర్థోపెడిక్ ఆపరేషన్ ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ఫార్మసీ లో మందుల తరపున విధానం పై ఆరా తీశారు. ఫార్మసీ స్టాక్ క్రమ పద్ధతి ప్రకారం ఏర్పాటు చేయడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని వెయిటింగ్ ఏరియాలో రోగుల సౌకర్యార్థం సీటింగ్ సామర్థ్యం పెంచాలని, వ్యక్తిగత వస్తువులు పెట్టుకునేందుకు ప్రత్యేక సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆర్ ఎం ఓ కు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఓ డాక్టర్ విజయకుమార్ నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ సాయి ప్రసాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దీపౌరదేవి దర్శనానికి పాదయాత్రగా భక్తులు

ముధోల్:18మార్చ్ (తెలంగాణ పత్రిక)

ముధోల్ మండలంలోని విట్టోలి తండా గ్రామానికి చెందిన శ్రీ సంత్ సేవాలాల్ దీక్ష స్వాములు బుధవారం మహారాష్ట్ర లో ని ప్రసిద్ధి చెందిన పౌరాదేవి, మహెర్ ఆలయాలకు పాదయాత్రగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా దీక్ష స్వాములు సుమారు 270 కిలో మీటర్ల పాదయాత్రగా కొనసాగుతుం దన్నారు. ఈపాదయాత్ర ఐదు రోజులలో చేరుకుంటామని స్వాములు తెలిపారు. దీంతో పాదయాత్రగా వెళ్తున్న శ్రీ సంత్ సేవా లాల్ దీక్ష స్వాములను గ్రామస్తులు, పెద్దలు, యువకులు, ఆడపడుచులు సాగనంపారు. అదేవిధంగా మాహుర్, రుక్వీ గాడ్ ఆలయాల్లో శ్రీరామ నవమి సందర్భంగా పౌర దేవితో పాటు వివిధ ఆలయాల్లో దర్శనం చేసుకోవడం సేవాలాల్ దీక్ష స్వాములు తెలియజేశారు.



# నితీష్ ఆత్మహత్య ఘటన పై విచారణకు డిమాండ్

**– బాధ్యుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

కొత్తగూడెం ఆర్సి మార్చి 18 తెలంగాణ పత్రిక

కొత్తగూడెంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నితీష్ ఆత్మహత్య ఘటనపై అతని తల్లి మౌనిక మౌన నిరసన చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన నితీష్, 10వ తరగతి చదువుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థలో విద్యనభ్యసిస్తున్న సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని ఆమె కోరారు. మౌనిక ఆరోపణల ప్రకారం, స్కూల్ క్లాస్ టీచర్, ప్రిన్సిపాల్ మరియు సంబంధిత సిబ్బంది తన కుమారుడిని మానసికంగా వేధింపులకు గురిచేసినట్లు తెలిపారు. ఈ అంశంపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సంబంధిత విద్యాసంస్థ నిర్వహణపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కురిమెళ్ళ శంకర్ మాట్లాడుతూ, నితీష్ పై స్కూల్‌లో అనుచిత ప్రవర్తన జరిగిందని వచ్చిన ఆరోపణలను సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థిని తోటి విద్యార్థులతో కలిసి పోకుండా ఆంక్షలు విధించడం, మానసిక ఒత్తిడికి గురిచేసే పరిస్థితులు ఉన్నాయన్న ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరపాలని కోరారు. ఒక బ్రాంచ్ నుండి మరొక బ్రాంచ్‌కు మార్పు వంటి పరిణామాలు విద్యార్థి పై ప్రభావం



చూపినట్లయితే, వాటిని కూడా దర్యాప్తులో భాగంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులపై మానసిక ఒత్తిడి, టార్గెట్ విధానాలపై వస్తున్న ఆరోపణలను అధికారులు గమనించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. నితీష్ మరణానికి సంబంధించి బాధ్యత వహించిన వారి పై చట్టపరమైన కేసులు నమోదు చేసి, న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాధిత కుటుంబానికి మద్దతు తెలిపారు.

# పెద్దమ్మతల్లి ఉత్సవాలకు గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి ఆహ్వానం

భిక్కనూరు మార్చి 18 ( తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి )

భిక్కనూరు మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరిగే శ్రీవనదుర్గ( పెద్దమ్మతల్లి) 27వ వార్షికోత్సవం సందర్భంగా ఉత్సవాలకు రాజకీయ ప్రముఖుల తాకిడి మొదలైంది. ఈ వేడుకలకు రావాల్సిందిగా టీ,పీ,సీ,సీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ముదిరాజ్ సదర్ సంఘం అధ్యక్షులు బండి రాములు ముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రామంలోని పాండిల ఆధ్యక్షుల ఆధ్వర్యంలో చంద్రశేఖర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికను అందజేశారు. భిక్కనూరులో పెద్దమ్మ తల్లి ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించే ప్రతిష్టాత్మకమని, వేలాదిగా తరలివచ్చే భక్తుల మధ్య జరిగే ఈ వేడుకకు విశిష్ట అతిథిగా విచ్చేయాలని వారు కోరారు. ముదిరాజ్ సంఘం ఆహ్వానం మేరకు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలకు తాను తప్పకుండా హాజరవుతానని స్పష్టం చేశారు. కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు,



ఇతర మౌలిక వసతుల కల్పనకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ముదిరాజ్ సంఘ సభ్యులు ఆయన స్పందన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుగంధ రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ రూపొందించండి

**– స్పైసెస్ బోర్డు నూతన డిప్యూటీ డైరెక్టర్ రామన్న ను కలిసిన జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి**

మంగపేట,మార్చి18(తెలంగాణ పత్రిక)

సుగంధ పంటలు సాగు చేస్తున్న రైతులను ఆర్థికంగా, సాంకేతికంగా ఆదుకునేందుకు అవసరమైన పథకాల అమలుకు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని జాతీయ సుగంధ ద్రవ్యాల అభివృద్ధి సంస్థ స్పైసెస్ బోర్డు వరంగల్ రీజనల్ నూతన డిప్యూటీ డైరెక్టర్ రామన్న ను జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ కమిటీ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి కోరారు బుధవారం వరంగల్ స్పైసెస్ బోర్డు ప్రాంతీయ కార్యాలయంలో కేరళ రాష్ట్రం నుండి బదిలీపై వచ్చి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్పైసెస్ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ రామన్న కు సాంబశివరెడ్డి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసి ఆయనతో భేటీ అయ్యారు ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుగంధ మరియు వాణిజ్య పంటగా మిర్చి పెద్ద ఎత్తున సాగు అవుతుందని మిర్చి రైతుల కోసం స్పైసెస్ బోర్డు నుండి వచ్చే ఆర్థిక సంవత్సరంలో విరివిగా వివిధ పథకాల కింద నిధులు మంజూరు అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు ఆర్థిక చేయుతతో పాటు సాంకేతిక సాగు పద్ధతులను ప్రోత్సహించేలా నిధులు మంజూరు చేయాలని తెలిపారు అదే విధంగా పసుపులో నూతన వంగడాల సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని నిజామాబాద్ జిల్లా కమ్మరపల్లి పసుపు పరిశోధన స్థానం నుండి నూతన పసుపు వంగడాల విత్తనాలను రైతులకు పంపిణీ చేసేందుకు స్పైసెస్ బోర్డ్ తో కలిసి పని చేయుటకు తమ ఎఫ్ పి ఓ సిద్ధంగా ఉందని ఇందుకోసం ములుగు



జిల్లా ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించాలని సాంబశివరెడ్డి కోరారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్పైసెస్ బోర్డు రీజనల్ సెమినార్ నిర్వహించాలని సూచించారు ఈ సందర్భంగా నూతన స్పైసెస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ రామన్న మాట్లాడుతూ వివిధ పథకాల నిధులు కోసం బోర్డు ప్రధాన కార్యాలయానికి కార్యాచరణ పంపిస్తామని నిధులు మంజూరు కాగానే అమలు చేస్తామన్నారు అదేవిధంగా త్వరలోనే అన్ని జిల్లాల్లోనూ పర్యటిస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు స్థానిక అధికారులు సాంబశివరెడ్డి వ్యక్తిగత సిబ్బంది పాల్గొన్నారు.

# 99 రోజుల కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలి

**– జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చ్ 18,(తెలంగాణ పత్రిక)

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలో కొనసాగుతున్న కార్యక్రమం పురోగతిని మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ఈ క్రమంలో ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించి శుభ్రత పనుల నిర్వహణ తీరుపై స్థానిక ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షాల కారణంగా కాలువలు పొంగి పొర్లడంతో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సందర్శించి లబ్ధిదారుల తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడంతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఇంటి నిర్మాణంలో అవలంబించ వలసిన నిబంధనలను లబ్ధిదారులకు వివరించాలని అధికారులను సూచించారు. అంగన్వాడీ, సీతారాంపల్లి లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థులకు అందిస్తున్న మెనూ, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వారి



అభ్యాస స్థితిగతులను తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషకాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధించి ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయాలని, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## పాఠశాలలో ఘనంగా ఉగాది వేడుకలు



ఊర్కొండ మార్చి 18 (తెలంగాణ పత్రిక)

నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలోని శ్రీ వేంకట బాల్ రామయ్య పాఠశాలలో పరాభవ నామ ఉగాది తెలుగు సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి మతాలకు అతీతంగా పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులందరు పిండి వంటలతో ,ఉగాది పచ్చడిని విద్యార్థులందరికీ పంచారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సామల తిరుపతయ్య మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయం వెనుక శాస్త్రీయత ఉందని విద్యార్థులు తప్పక పాటించాలని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ బాల్ రాజు మాట్లాడుతూ అన్ని మతాలను సాంప్రదాయానుసారంగా భారతీయులు నడుచుకోవాలని మరియు గౌరవించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జార్జ్ జోసెఫ్ ,వైస్ ప్రిన్సిపాల్ రామ్ పెరుమాండ్ల మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బొప్పన రత్నగిరి రావు పార్థివ దేహానికి నివాళులు మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు..



మిర్యాలగూడ ప్రతినిధి//మార్చి 18:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామానికి చెందిన 95 సంవత్సరాల వయస్సు గల బొప్పన రత్నగిరి రావు అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు, స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు వారి నివాసానికి వెళ్లి రత్నగిరి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం వారికి మన ధైర్యం కల్పించారు. వారి వెంట సిడి రవికుమార్, చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మట్టపల్లి సైదులు,వెలిశెట్టి రామకృష్ణ,చిమట మదార్, పునాటి లక్ష్మీనారాయణ, మహేష్, మాలోతు రవీందర్, తిరందాసు విష్ణు, భీమ్లా నాయక్, తుమ్మల ఫణి కుమార్, శ్రీను, దుర్గ, కోటేశ్వర రావు, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు..

## పేద విద్యార్థులకు నూతన వస్త్రాలు బహూకరణ.

**– ఉపాధ్యాయుడు ఎస్.కె. ఖాజామియా దాతృత్వ గుణానికి అభినందనలు**

కోదాడ, మార్చి 18 (తెలంగాణ పత్రిక):




పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల యందు జమాతే ఇస్లామీ హిందూ సంస్థ కోదాడ పట్టణ అధ్యక్షులు గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్కె. ఖాజా మియా ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా 20 మంది పేద విద్యార్థులకు నూతన వస్త్రాలు బహూకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కోదాడ మండల విద్యాధికారి ఎండి .సలీం షరీఫ్ పాల్గొని మాట్లాడినారు. పండగలు సమాజహితాన్ని బోధిస్తా యని, అన్ని మతాలు మనుషుల మధ్య ప్రేమ, సోదర,సామాజిక బాధ్యతను పెంపొందించు కోవడానికి కృషి చేయాలని తెలియజేస్తున్నాయని తెలిపారు. ఉపాధ్యాయుడు ఎస్ కె ఖాజామియా దాతృత్వ గుణాన్ని అభినందిస్తూ, జమాతే ఇస్లామీ హిందూ సంస్థ కోదాడ పట్టణంలో చేస్తున్న సేవా కార్యక్రమాల కృషి స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని , సేవ ,సామాజిక బాధ్యత గుణాలను అలవర్చుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు.

**– బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు అంజి యాదవ్,**

అనంతగిరి, మార్చి 18 (తెలంగాణ పత్రిక):



పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు ఘనంగా అనంతగిరి గ్రామం నందు బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు మల్లెబోయిన అంజి యాదవ్ ఆధ్వర్యంలో వారి నివాస నందు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని తన సోదరుడు సూర్యాపేట జిల్లా బిజెపి పార్టీ ఉపాధ్యక్షులు మల్లెబోయిన వెంకటేష్ బాబు ఇఫ్తార్ విందును ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులతో కలిసి వారితో ప్రార్థనలు చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ ఆత్మీయ విందు మతసామరస్యానికి స్నేహ భవానికి ప్రతికలుగా నిలుస్తాయని. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి కూర్చొని భోజనం చేయడం ద్వారా ప్రేమ ఆత్మీయతలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్రామ పెద్దలు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి గొర్రెలు, మేకల యూనిట్లు



ఇల్లంతకుంట, మార్చి 18 తెలంగాణ పత్రిక

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం కింద జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ఎన్ ఆర్ ఎల్ ఎం ద్వారా ఇల్లంతకుంట గ్రామంలో గొర్రెలు, మేకల యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ యూనిట్‌ను సర్పంచ్ మామిడి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీ రుణాలను మహిళలు ఆదాయ వృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఇలాంటి యూనిట్ల స్థాపనతో కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.అదేవిధంగా ముష్కానిపేట గ్రామంలో కూడా గొర్రెలు, మేకల యూనిట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.ఈ కార్య క్రమంలో ముష్కానిపేట ఉపసర్పంచ్ లావణ్య, వార్డు సభ్యులు, వెటర్నరీ వైద్యురాలు డాక్టర్ పూర్ణ చంద్రిక, ఏపీఎం చెన్నబోయిన కుమారస్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కట్ట సౌమ్య, వీఓలు సఫియా, సుమలత, సీసీలు రామచంద్రారెడ్డి, వెంకటేశం, విఠల్ రెడ్డి, వీఓఏలు వినోద, రాజు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**- వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాట్లు**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 18, తెలంగాణ పత్రిక

జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాపై పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఎల్‌పీజీ గ్యాస్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు తెలిపారు.ఈ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించేందుకు టి. సృజన, వి. వినాయక్ లు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగ దారులు 8008429738 ఫోన్ నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూమ్ ద్వారా ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతో పాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామన్నారు. కంట్రోల్ రూమ్‌లో నమోదు అయ్యే ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ఉగాది కవి సమ్మేళన పురస్కార అవార్డు
# కరీంనగర్ ఆర్డిఓ మహేశ్వర్ చేతుల మీదుగా
# అందుకున్న వికలాంగుడు ఓదెల నరేష్



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 18, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన కవి ఓదెల నరేష్ ఉగాది పురస్కారం అందుకున్నాడు. ఉగాది సందర్భంగా కరీంనగర్ లో జరిగిన కవుల సమ్మేళనంలో ప్రతిభ కనబరిచిన వికలాంగుడు ఓదెల నరేష్ కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్డిఓ మహేశ్వర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నాడు తాను 2011 నుండి ఇప్పటివరకు ఈ రోజు వరకు తాను కవితలను రాస్తూ తన కవితలను గుర్తించి కరీంనగర్ లో లయన్స్ ఇంటర్నేషనల్ సమైక్య సాహితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రదర్శించగా పురస్కారం లభించిందని వికలాంగుడు ఓదెల నరేష్ తెలిపారు.అతడిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర యంత్రాంగం గుర్తించి స్పెషల్ కేసు కింద ఏదైనా ఉద్యోగం ఇవ్వాలని ఓదెల నరేష్ కొడుతున్నాడు ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మహేశ్వర్ అధ్యక్షులు మాడిశెట్టి గోపాల్ రీజియన్ చైర్మన్ లయన్స్ గాలిపల్లి వెంకట్ ప్రధాన కార్యదర్శి కె ఎస్ అనంత చార్య ప్రొఫెసర్ డాక్టర్ అడువాల సుజాత కవులు తదితరులు పాల్గొన్నారు...

# వ్యాధి నిరోధక టీకాల పంపిణీలో లక్ష్యాలను సాధించాలి: జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత





సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 18, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం వంద శాతం విజయవంతం కావాలని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె జిల్లాలోని పలు మండలాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ ఉప కేంద్రాలు, గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రానజ), మరియు ముస్తాబాద్ మండలంలోని పోతుగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్ నిల్వలు, వ్యాక్సిన్ క్యారియర్లు మరియు శీతలీకరణ వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. పిల్లలకు టీకా వేసిన వెంటనే ఆ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.ఉప కేంద్రాల పరిధిలోని 0-5 ఏళ్ల లోపు పిల్లలందరికీ సరైన సమయంలో టీకాలు అందేలా చూడాలి. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాల ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదు. అనంతరం గంభీరావుపేటలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ పర్యటనలో డాక్టర్ రజిత పాల్గొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో కార్తీక్ గారు మరియు ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నవోదయ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు

తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, మార్చ్ 18.



నవోదయ విద్యాలయాల్లో ప్రవేశం పొందడం అనేది చాలా మంది గ్రామీణ మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల కల. కానీ ఈ పరీక్షలకు సిద్ధమయ్యే సమయంలో వారు ఎదుర్కొనే కష్టాలు కూడా చాలా ఉంటాయి. కానీ ఎటువంటి ఆటంకాలు ఎదురైనా క్రమశిక్షణ, చదువుపై పట్టుదలతో ఆ ఇద్దరు విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఆ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా అడుగులు వేసి నవోదయ పాఠశాలలో సీటు సాధించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండల కేంద్రానికి చెందిన గనగాని ప్రవీణ్- స్రవంతి దంపతుల కుమారుడు గనగాని జస్వంత్ గౌడ్ ,ఏడూళ్ల బయ్యారం గ్రామానికి చెందిన బుయ్యవరపు భాస్కర సూరి- రమ్య దంపతుల కుమారుడు బుయ్యవరపు దేవి శ్రీ చరణ్, పొట్లపల్లి గ్రామానికి చెందిన శేరు మహిపాల్ కుమార్తె శేరు వేదాన్సిక నవోదయ పరీక్షలో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఈ ఘనత సాధించారు. ఇదే మండలంలో రాధికా కాన్సెప్ట్ స్కూల్, ఎక్సలెంట్ భాషా హై స్కూల్, సెయింట్ మేరీ పాఠశాలల్లో ఐదవ తరగతి చదువుతున్న ఈ విద్యార్థులు పట్టుదలతో చదివి వేలాదిమంది పోటీపడిన ఈ ప్రవేశ పరీక్షలో సీటు సాధించడం ఎంతో గర్వంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందంలో మునిగితేలారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సాధారణమైన విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించడం ద్వారానే ఇది సాధ్యమైందని పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి. నవోదయ సీటు సాధించిన విద్యార్థులను గ్రామస్తులు, ప్రైవేటు పాఠశాలల అధ్యాపక సిబ్బంది, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

# బడ్జెట్‌లో బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలి కంచర్ల రవి గౌడ్ డిమాండ్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 18, తెలంగాణ పత్రిక



రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ వర్గాల కోసం కనీసం లక్ష కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో పెద్దఎత్తున హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను పూర్తిగా మోసం చేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక బీసీలను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించిన మహానాయకుడని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీసీలకు నిజమైన న్యాయం జరిగిందని పేర్కొన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి బడ్జెట్‌లో బీసీలకు భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలు బిచ్చగాళ్లు కాదని, వారికి రావాల్సిన హక్కు వాటాను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని స్పష్టం చేశారు. బీసీలకు అన్యాయం కొనసాగితే ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్ అరే వెల్లి వినయ్ కుమార్ నవీన్ విష్ణు షాద్ శేఖర్ జుమీర్ రమేష్ అజిత్ రాజు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొల్చారం ఎంఈఓ సారధ్యంలో కొల్చారంలో మాస్ కాపీయింగ్





**- పోతంశెట్టిపల్లి ఉన్నత పాఠశాల కేంద్రంగా విద్యార్థులకు జవాబులు .**

**- అప్పాజీపల్లి లో మినీ ప్రింట్ తీసుకొని కొల్చారం ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసిన విద్యార్థులకు అందజేస్తున్న ఎంఈఓ.**

**- పోతంశెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డ నలుగురు ఉపాధ్యాయులు.**

వెల్దుర్తిమండల ప్రతినిధి, మార్చ్ 18 (తెలంగాణ పత్రిక):

మండల కేంద్రమైన కొల్చారం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులకు కొల్చారం ఎంఈఓ ఉమారాణి డైరెక్షన్లో ప్రశ్నలకు జవాబులు మినీ ప్రింట్ జిరాక్స్ రూపంలో అందజేయడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రానికి ప్రశ్నా పత్రాలు చేరగానే ఎగ్జామినేషన్ డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయులు వాట్సాప్ ద్వారా ప్రశ్నాపత్రాలను పంపుతున్నారు. పోతంశెట్టిపల్లి ఉన్నత పాఠశాల లో కొల్చారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయురాలు, అంసన్ పల్లి ఉన్నత పాఠశాలలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయులు షాకీర్ అలీ, వరిగుంతం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శివ, ఎనగండ్ల హిందీ ఉపాధ్యాయుడు అర్జున్ లో కలిసి తమకు వచ్చిన ప్రశ్న పత్రానికి సంబంధించిన జవాబులను స్టడీ మెటీరియల్ నుండి తీసి మినీ జిరాక్స్నుగా రూపొందించారు. మండల విద్యాధికారి ఉమారాణి వీటిని స్వయంగా పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లి విద్యార్థులకు అందజేస్తున్నారు. ఈ విషయం తెలిసిన మండల కేంద్రమైన కొల్చారం గ్రామానికి చెందిన విలేకరులు కొందరు మండల వనరుల కేంద్రం వద్దకు వెళ్లగా జిరాక్స్ను తీస్తున్న మండల వనరుల కేంద్రం కంప్యూటర్ ఆపరేటర్ సంపత్ వెంటనే జిరాక్స్ లు ఆపివేసి ఎం ఈ ఓ తో కలిసి బయటకు వెళ్లారు.పోతంశెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక గదిలో ఉపాధ్యాయులు ఉన్నట్లు, వారు పదవ తరగతి పరీక్షలకు సంబంధించి జవాబులు రూపొందిస్తు న్నారు అని తెలియడంతో అక్కడికి వెళ్ళగా ప్రశ్నలకు జవాబులు రాస్తున్న ఉపాధ్యాయులు పట్టుపడ్డారు. విలేకరులను చూసిన సదరు ఉపాధ్యాయులు అక్కడి నుండి గోడలు దూకి పరాయ్యారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజన్

గురువారం,
మార్చి 19 2026
కరీంనగర్



# పాఠశాలలో మొక్కలు నాటింపు పర్యావరణ పరిరక్షణకు ఐక్య తల్లిదండ్రుల సంఘం పిలుపు

లక్ష్మీదేవిపల్లి మండలం, మార్చి 18: తెలంగాణ పత్రిక

ఐక్య తల్లిదండ్రుల సంఘం పర్యావరణ పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో లక్ష్మీదేవి పల్లి మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బికారి తండలో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా చైర్మన్ వేణు మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో వివిధ రకాల పూల మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు రాజేష్ అధ్యక్షత వహించగా, వేపలగడ్డ గ్రామపంచాయతీ సర్పంచ్ నునావత్ సేవా కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు యూపీఏ రాష్ట్ర అధ్యక్షులు మారుతి రత్నాకర్, ఏటీఈసీ రాష్ట్ర కోశాధికారి బి. చందర్, మండల సహాధ్యక్షులు నైనారపు సీతారాములు తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సేవా కుమార్ మాట్లాడుతూ పచ్చని గ్రామ నిర్మాణానికి చెట్లు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. విద్యార్థులు నాటిన ప్రతి మొక్కను తమ సొంత సహోదరుల్లా చూసుకోవాలని, భవిష్యత్తులో అవే చెట్లు గ్రామానికి నీడనూ, స్వచ్ఛమైన గాలినీ అందిస్తాయని తెలిపారు. మారుతి రత్నాకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా పిల్లల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. చెట్లు మన ప్రాణవాయువుకు మూలమని, ప్రతి విద్యార్థి నాటిన



మొక్కను స్నేహితుడిగా భావించి సంరక్షించాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షులు రాజేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను పాఠశాల స్థాయిలోనే ప్రారంభించడం సమాజానికి బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దాన్ని పెంచే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఉయ్యాలను సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లి దండ్రులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రంజాన్ పండగను పురస్కరించుకొని తోఫా కిట్ల పంపిణీ

- ఎమ్మార్వో సరోజ పావని సర్పంచ్ నన్నపోయిన పార్వతమ్మ రమేష్

మాడ్గులపల్లి//నల్గొండ//మార్చి 18:(తెలంగాణ పత్రిక):-

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రంజాన్ పండగ ను పురస్కరించుకొని ముస్లిం సోదరులకు తోఫ కిట్లను మండలంలోని వివిధ గ్రామాలకు పంపిణీ చేయడం జరిగింది. ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని, మాడ్గులపల్లి తహశీల్దార్ సరోజ పావని అన్నారు. మంగళవారం తోపుచర్ల గ్రామంలో రంజాన్ పర్వదినం సందర్భంగా పేద ముస్లింలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫా లను స్థానిక గ్రామ సర్పంచ్ నన్నబోయిన పార్వతమ్మ రమేష్, ఆర్ ఐ సత్యనారాయణ, మరియు ప్రజా ప్రతినిధులు ముస్లిం మత పెద్దలతో కలిసి పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మార్వో సరోజ పావని మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని పేద ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపు కోవాలని ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించడం జరిగిందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని మాడ్గులపల్లి మండల పరిధిలోని గ్రామాలకు 100 రంజాన్ తోఫా కిట్లను కేటాయించగా మండలంలోని తోపుచర్ల గ్రామంలోని మస్జిద్ కమిటీలకు అందజేసి స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు



ముస్లిం మత పెద్దలతో కలిసి పేద ముస్లింలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. నాయబ్ తాహశీల్దార్ కత్తుల సైదులు ఆర్ ఐ శ్యామ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గౌని నిరంజన్, ఉపసర్పంచ్ వల్లపు నరేష్, పంచాయతీ సెక్రెటరీ నరేష్, నెంబర్లు ఖలీల్, సామ నిర్మల, వల్లపు దాస్ వేణు, పాటు స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామ పాలన అధికారులు ముస్లిం మత పెద్దలు మైనార్టీలు పాల్గొన్నారు.

# బెండాలపాడులో అభివృద్ధి పనుల పరిశీలన

- వేగవంతానికి అదనపు కలెక్టర్ ఆదేశాలు

అశ్వరావుపేట ఆర్ సి , మార్చి 18, తెలంగాణ పత్రిక.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి విద్యచందన బుధవారం పరిశీలించారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద చేపట్టిన పనులను ఆమె సమీక్షించారు. ఈ సందర్భం గా చంద్రుగొండ ఎంపీడీఓ అశోక్, స్థానిక సర్పంచ్ బొర్రా లలిత, ఉపసర్పంచ్ బానోవత్ బాలు తదితరులతో కలిసి గ్రామంలో కొనసాగుతున్న సి.సి రోడ్లు, ఎస్‌హెచ్‌జీ (డ్వాక్రా) మహిళల వి.ఓ భవనం నిర్మాణం వంటి పనులను సందర్శిం చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యచందన మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పనుల నాణ్యత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయతీ స్పెషల్ అధికారి, కార్యదర్శి రోహిత్, ఎన్ఆర్ఈజీఎస్



సిబ్బంది, జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, బోడ బాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ దేవరుప్పులలో జిపి కార్మికుల రాస్తారోకో

దేవరుప్పుల మార్చి 18 (తెలంగాణ పత్రిక):

రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ దేవరుప్పులలో జిపి కార్మికులు బుధవారం రోడ్డెక్కారు. దేవరుప్పుల చౌరస్తా వద్ద మండలంలోని పలు గ్రామాల జిపి కార్మికులు రాస్తారోకో నిర్వహించగా కార్యక్రమానికి జిపి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బస్వ రామచందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిరంకుశంగా పోలీస్ నిర్బంధం ప్రయోగించి అక్రమ అరెస్టులతో జిపి కార్మికుల ఉద్యమాన్ని అనిచి చేయాలనుకోవడం సమంజసం కాదన్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్& వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అసెంబ్లీ సమావేశాల లో తమ జీవి కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్చించాలనే డిమాండ్‌తో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతించకుండా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులను అక్రమంగా అరెస్టులు చేసి ఇబ్బందులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గ్రామపంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా జీతాలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని ఆన్లైన్‌లో నమోదు కాని గ్రామ పంచాయతీ సిబ్బంది పేర్లను వెంటనే




ఆన్లైన్‌లో నమోదు చేయలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు.లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ &వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల అధ్యక్షులు సంగీ కరుణాకర్, నాయకులు వారాల సోమరాజు, గానగాని ఉప్పలయ్య, కోశాధికారి బెజగం పరమేష్, గొడిశాల సోమన్న, ఉప్పుల ఐలయ్య , దావల శ్రీనివాస్ ,జోగు కలమ్మ ,చింత రామచందర్ , బొందుగుల రమేష్, చెరుపెల్లి కుమార్ , గడ్డం సోమయ్య, గడ్డం బాబు , భాష పాక పద్మ, రేణుక, చింత నరసింహ, సట్ల యాదగిరి, కార్మికులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషించాలి : ఐకెపి ఎపిఎం విజయ.



తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, మార్చి 18.

పినపాక మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయం వద్ద మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకెపి ఎపిఎం విజయ మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని, పొదుపు అలవాటు పెంచుకోవాలని కోరారు.సంఘాల బలోపేతం ద్వారా గ్రామాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషించాలని, ప్రతి సభ్యురాలు చురుకుగా పాల్గొని సంఘాలను మరింత బలోపేతం చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో సంఘాల నిర్వహణ, రుణాల వినియోగం, తిరిగి చెల్లింపులపై అవగాహన కల్పించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కార మార్గాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు, సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రశాంతంగా కొనసాగిన మున్సిపల్ సర్వ సభ్య సమావేశం





తెలంగాణ పత్రిక ప్రెస్ రిపోర్టర్ మోహన్ బోధన్ మండలం. మార్చి18 :

బోధన్ పట్టణ మున్సిపల్ సర్వ సభ్య సమావేశం ప్రశాంతం వాతావరణంలో సజావుగా కొనసాగింది. మున్సిపల్ సమావేశపు హాలులో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన సమా వేశంలో 27ఎజెండాలకు గాను 27ఎజెండాలు ఆమోదించారు. అభివృద్ధి పనుల కోసం 15వ ఆర్థిక నిధులతో 15లక్షలు,25లక్షలు ఎల్ఆర్ఎస్ నిధులు కేటాయించారు.

## కృషి యూత్ మునిపల్లి తరపున ఉగాది శుభాకాంక్షలు




తెలంగాణ పత్రిక ప్రతినిధి మార్చి 18

యువత కొత్త అవకాశలను ఉపయోగించుకుంటు పాత పద్ధతులను మరువ కుండా అన్ని రంగాలలో మంచి చెడు కష్టం సుఖం బాధ ఉగాది పచ్చడి లాగా చేదు పులుపు కారం తీపి ఓగారు జీవితంలో కూడా ఉంటాయి అన్నింటిని కలుపుకొని సుఖసంతోషాలతో యూవత ముందుకు సాగాలి అని మంచి విజయాలు సాదించాలి కోరుకుంటూ మునిపల్లి గ్రామ ప్రజలకి మండల ప్రజలకి శ్రీ పరభావనమా సంవత్సర ఉగాది శుభాకాంక్షలు మీ కృషియూత్ మునిపల్లి

## పరామర్శించిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై.నరోత్తం



జహీరాబాద్ ప్రతినిధి మార్చ్ 18(తెలంగాణ పత్రిక )

జహీరాబాద్ నియోజకవర్గంమొగుడంపల్లి మండలం గొడిగార్ పల్లి గ్రామంలో గత ఐదు రోజుల క్రితం ఈడిగి విఠల్ గౌడ్ తండ్రి ఈడిగి ఇస్మాయిల్ జి గౌడ్ మరణించడం జరిగింది ఈ రోజు ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై నరోత్తం వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్ ఎన్ మల్లేశం చెంగల్ జైపాల్ సామెల్ తదితరులు ఉన్నారు.

## రైతు భరోసాకు .. దరఖాస్తులు ఆహ్వానం

- మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరాజు

పాపన్నపేట, ప్రతినిధి మార్చి 18:(తెలంగాణ పత్రిక)



కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొందిన మండల పరిధి లోని రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసు కోవాలని మండల వ్యవసాయాధి కారి శ్రీనివాసరాజు తెలిపారు. ప్రస్తుత యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించి కొత్త అప్లికేష న్లు, బ్యాంకు వివరాల అప్డేట్ కోసం మార్చి 25 లోపు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలతో పాటు బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తో దరఖాస్తు సమర్పించాలన్నారు.

## షెడ్యూల్డు కులముల నిరుద్యోగ యువతీ, యువకులు నుంచి దరఖాస్తులు ఆహ్వానం.

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిధి మార్చి 18 ( తెలంగాణ పత్రిక )

రామగుండం నియోజకవర్గం నందు నివసించే షెడ్యూల్డు కులముల నిరుద్యోగ యువతీ, యువకులకు జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం పెద్దపల్లి ద్వారా రామగుండము సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం దగ్గర నిర్మింపబడిన దుకాణముల సముదాయం (అద్దె పై) లబ్దిదారుల ఎంపిక గురించి దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డు కులముల నిరుద్యోగ యువతీ, యువకులు దుకాణముల సముదాయములో ఏదైనా స్వంత పెట్టుబడితో జీవనోపాది కొరకు వ్యాపారం ప్రారంభించేందుకు దరఖాస్తులు చేసుకోవాలని, సంబంధించిన దరఖాస్తు ఫారంలను కలెక్టర్ కార్యాలయం పెద్దపల్లి నందు ఎస్.సి కార్పొరేషన్ కార్యాలయం రూమ్ నం.225, మొదటి అంతస్తులో మార్చి 31లోపు దరఖాస్తులు సమర్పించాలని, అర్హత కలిగిన లబ్దిదారులను ఎంపిక చేసి, కార్యాలయం ద్వారా ఎంపిక కాబడిన అభ్యర్థులకు మొబైల్ నెంబర్ కి మెసేజ్, ఫోన్ ద్వారా వివరాలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఉగాది సంబరాలు.



తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, మార్చి 18.

ఉగాది పండుగ సందర్భంగా పినపాక మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ఉగాది విశిష్టత, కొత్త సంవత్సర ఆరంభం గురించి వివరించారు. పాఠశాల ప్రాంగణంలో రంగవల్లులు వేయడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పాటలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కన్నేకల్ గ్రామ ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ నాగరాజ్ యాదవ్.

మాడుగుల పల్లి/నల్గొండ/మార్చి 18:(తెలంగాణ పత్రిక):-



మాడుగులపల్లి మండల, కనేకల్లు గ్రామ ప్రజలకు సర్పంచ్ సర్నాల నాగరాజు యాదవ్ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఉగాది నుండే నూతన సంవత్సరం ఆరంభమవుతుందని, తమ వ్యవసాయ పనులను రైతన్నలు ఉగాది నుండే ప్రారంభించు కుంటారని అన్నారు.ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పర్వదినం అని ఆయన పేర్కొన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. చెట్లు పచ్చగా చిగురిస్తూ, ప్రకృతి మాత నూతనోత్సాహాన్ని సంతరించుకుంటుందని, అదే నూతనోత్సాహం ప్రజల జీవితాల్లో నిండాలని కోరుకున్నారు. రైతన్నలు, సబ్బండ వర్గాల సంక్షేమం దిశగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టి, ప్రజల జీవితాల్లో మరింతగా గుణాత్మక మార్పును తీసుకురావాలని వారు అన్నారు.

# హోటళ్ల పై పౌరసరఫరాల శాఖ దాడులు

తెలంగాణ పత్రిక/దమ్మపేట(మార్చి 18)

దమ్మపేట మండల కేంద్రంలో గల హోటళ్ల లో అక్రమంగా వినియోగిస్తున్న గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల పై పౌర సరఫరాల శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించిన తనిఖీల్లో అధికారులు 36 గృహ వినియోగ సిలిండర్లను స్వాధీనం చేసుకొని పలువురు హోటళ్ళ యజమానుల పై కేసులు నమోదు చేశారు. సీజ్ చేసిన సిలిండర్లను భద్రపరచడం కోసం చిలకలగండి ముత్యాలమ్మ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడు తూ సబ్సిడీ సిలిండర్లను వాణిజ్యపరంగా వాడడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు, గృహ అవసరాలకు అందాల్సిన గ్యాస్‌ను అక్రమంగా మళ్లిస్తే సహించేది లేదన్నారు. ఎక్కడైనా గ్యాస్ సిలిండర్ల అక్రమ విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే టోల్-ఫ్రీ నంబర్ 1967కు గానీ, స్థానిక పౌరసరఫరాల కార్యాలయంలో గానీ ఫిర్యాదు చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాతో పాటు గ్యాస్ కనెక్షన్‌ను శాశ్వతం




గా రద్దు చేస్తాము అని తెలియజేశారు. దాడుల్లో జిల్లా అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

# సమృద్ధిగా అందుబాటులో ఎల్.పి.జి గ్యాస్ సిలిండర్లు

- భయాందోళనలతో గ్యాస్ సిలిండర్ బుకింగ్ చేసుకోవద్దు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిధి మార్చి 18 ( తెలంగాణ పత్రిక )

జిల్లాలో ఎల్.పి.జి గ్యాస్ సిలిండర్లు స్టాక్ సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అనవసర ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మన జిల్లాలో గత రెండు రోజులలో సరాసరి కంటే 40% అధికంగా గ్యాస్ సిలిండర్ బుకింగ్ జరిగాయని, ప్రజలు భయాందోళనలతో గ్యాస్ సిలిండర్ బుక్ చేయవద్దని కలెక్టర్ కోరారు.3 నుంచి నాలుగు రోజుల వ్యవధిలో గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సమృద్ధిగా గ్యాస్ సిలిండర్ల స్టాక్ అందుబాటులో ఉందని, గ్యాస్ సిలిండర్ స్టాక్ అంశాన్ని జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందని ప్రజలు అనవసర భయాందోళనలకు గురి కావద్దని కలెక్టర్ పేర్కొన్నారు.ఎల్.పి.జి సిలిండర్లను బ్లాక్ మార్కెట్ కు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 కేసులు నమోదు చేసి 29 సిలిండర్స్ సీజ్ చేయడం జరిగింది. జిల్లాలో 15 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరుగుతుందని వాటి డెలివరీలో ఏవైనా ఆటంకాలు ఎదురైతే జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నంబరు 08728 224045ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. గృహ సంబంధిత అవసరాలకు సరఫరా చేసే ఎల్.పి.జి సిలిండర్లను ప్రతి రోజు ఆర్డీఓలు, తహసీల్దార్లు, సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షిస్తున్నారని,ఎల్.పి.జి సిలిండర్ల సరఫరా పై వదంతులు నమ్మి



ఆందోళన చెందవద్దని గృహ వినియోగానికి, ఆసుపత్రులకు, విద్యా సంస్థలకు, వృద్ధాశ్రమాలకు, ప్రభుత్వ సంస్థలకు సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# కుటుంబ సమేతంగా లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న

- నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అర్చకులు సముద్రాల సుదర్శన్ చార్యులు

పరకాల/గీసుకొండ/ మార్చి 18 తెలంగాణ పత్రిక

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఇటీవల కాలంలోనే డాక్టరేట్ వచ్చిన సందర్భంగా కుటుంబ సమేతంగా కొమ్మల లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న వరంగల్ జిల్లా ఊకల్ (హవేలి) నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీమాన్ సముద్రాల సుదర్శన్ ఆచార్యులు.... వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికిన కొమ్మాల లక్ష్మి నరసింహ స్వామి అర్చకులు రామాచార్యులు.. ఈ సందర్భంగా సుదర్శన్ చార్యులు మాట్లాడుతూ డాక్టరేట్ వచ్చిన సందర్భంగా మొదటిసారి కుటుంబ సమేతంగా కొమ్మల లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకు న్నానని తెలిపారు.. అలాగే కొన్ని వందల సంవత్సరాల క్రితం కొమ్మిడి వంశస్థులు ఆలయ గుట్ట సమీపంలో జీవనం సాగించేవారు. ఇదే ప్రాంతంలో మొక్కజొన్న పంటను ఓ రైతు సాగు చేశాడు. కొద్దిరోజుల అనంతరం కోతకు వచ్చి జొన్న చేనును రైతు కోయటం ప్రారంభించారు. ఎంతకు కోత పూర్తి కాకపోవటంతో అలసి అక్కడే చెట్టు నీడన కూర్చున్నాడు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన ఒక బాలుడు పంట చేనును తాను కోసిపెడతానని.. తనకు కొడవలి, తాగటానికి దూపబుడ్డి కావాలని రైతుకు చెబుతాడు. సరేనని ఆ బాలునికి కొడవలి ఇచ్చి దూపబుడ్డి కోసం రైతు వెళుతాడు. తిరిగి వచ్చే సరికి మొత్తం చేను కోసి ఉండటం చూసిన రైతు ఆశ్చర్యపోయడు. బాలుడి కోసం వెదుకుతాడు. కానీ, ఆ బాలుడు కనబడకపోవటంతో రైతు ఇంటికి వస్తాడు. అదే రోజు రాత్రి ఆ రైతు కలలోకి బాలుడు వచ్చి తాను నరసింహస్వామినని.. ఇక్కడ ఉన్న గుట్టపై వెలుస్తున్నాని, ఆలయం కట్టించాలని కోరాడట. ఈ విధంగా ఆలయ నిర్మాణం జరిగిందని స్థల పురాణంలో చెబుతారు. 40 అడుగుల ఎత్తులో ఉన్న గుట్టపై గల రాతిగుహాలో



స్వామి వారు వెలియగా అప్పటి నుంచి కొమ్మాల జాతర కొనసాగుతున్నట్లు వారు చెబుతారు. పూర్వకాలంలో పాండవులు కూడా స్వామి వారిని పూజించినట్లు స్థల పురాణంలో ఉందని అన్నారు.

# పెద్దపల్లి పట్టణంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





- అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి.
- నెలలో స్విమ్మింగ్ పూల్, 2 నెలలో బ్యాడ్మింటన్ కోర్టు పూర్తి

పెద్దపల్లి, ప్రతినిధి మార్చి 18 ( తెలంగాణ పత్రిక )

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (బాయ్స్) జరుగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని, ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నిర్మిస్తున్న ఈత కొలను (స్విమ్మింగ్ పూల్) పనులను, వ్యవసాయ మార్కెట్ లో నిర్మిస్తున్న ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్ట్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 10వ తరగతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేశామని, పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఐ.టి.ఐ లో నూతనంగా నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులను త్వరగా పూర్తి చేసి 3 నెలలో అందుబాటులో తీసుకుని రావాలని కలెక్టర్ ఆదేశించారు.పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో నిర్మిస్తున్న ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు కాంప్లెక్స్ పనులను రెండు నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో ఏఈ నరేష్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థినుల పై అసభ్య ప్రవర్తన, నిందితులకు 3 ఏళ్ల జైలు శిక్ష

**- నిందితులకు చెరో లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.2 లక్షల జరిమానా**

**- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్**

వెల్దుర్తిమండల ప్రతినిధి, మార్చ్ 18 (తెలంగాణ పత్రిక):

మెదక్: హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వాచ్‌మెన్ స్వామి, అటెండర్ రాజుకు కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. విద్యార్థినుల భుజాల పై చేతులు వేయడం, వారు బట్టలు మార్చుకునే సమయంలో రహస్యంగా గమనించడం వంటి ఘటనలపై ఆగష్టు 2108 లో ఫిర్యాదు అందినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై అప్పటి తూప్రాన్ ఎస్ఐ నాగార్జున గౌడ్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి ఐఓలు డీఎస్పీ తూప్రాన్ రాంగోపాల్ రావు, కిరణ్ కుమార్‌లు పూర్తి సాక్ష్యాలను సేకరించారు. ప్రస్తుత ఐఓ గంగారాజు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితులకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు చెరో లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ. 2 లక్షల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ ఆఫీసర్ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ నాగరాజు, భరోసా లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేతా తదితరులు సహకరించినట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు




సిబ్బందిని మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్యను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# జ్ఞాన అకాడమీ జైత్రయాత్ర సైనిక్ & నవోదయలో రాష్ట్ర, జిల్లా ర్యాంకులు

జగిత్యాల జిల్లా, తెలంగాణ పత్రిక, మార్చ్ 18.

జగిత్యాల పట్టణంలోని జ్ఞాన అకాడమీ విద్యార్థులు సైనిక్ స్కూల్,నవోదయ ప్రవేశ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తూ ఘన విజయాన్ని సాధించారు.రాష్ట్ర,జిల్లా స్థాయిలో ప్రతిష్టాత్మక ర్యాంకులు సాధించి అకాడమీకి గౌరవం తీసుకువచ్చారు. సైనిక్ ప్రవేశ పరీక్షలో విశ్వ విరాట్ రాష్ట్రంలో 3వ స్థానం సాధించి ప్రతిభ చాటగా శివ తేజ 6వ స్థానం,శ్రేయాన్వి 23వ స్థానం దక్కించుకున్నారు. హరినందన్, రుత్విక్, హసిత్, సమ్యుక్త, హార్దిక్,మనుప్రీత్,మనస్విత్ వంటి విద్యార్థులు కూడా మెరుగైన ఫలితాలు సాధించి ప్రతిభ కనబరిచారు. నవోదయ ప్రవేశ పరీక్షలో శివ తేజ, హరినందన్,హార్దిక్, ఆర్యన్,పార్థు,కృష్ణ కార్తిక్ సీట్లు సాధించి అకాడమీ ప్రతిష్టను మరింత పెంచారు. ఈ విజయంతో ఆనందం వ్యక్తం చేసిన అకాడమీ డైరెక్టర్ కార్తీక్,అధ్యాపక బృందం,తల్లిదండ్రులు విద్యార్థులను అభినందిస్తూ, వారి భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా ఉండాలని ఆకాంక్షించారు.ఒకే అకాడమీ నుండి ఇంత పెద్ద స్థాయిలో రాష్ట్ర ర్యాంకులు,నవోదయ సీట్లు రావడం విశేషమని




విద్యా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# బీసీలను అవమానించే విధంగా మాట్లాడిన కోమటిరెడ్డి మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలి

**- బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి టీపీసీసీ అధ్యక్షునిగా ఉంటే ఇంత ఓర్వలేని తనమా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్**

మిర్యాలగూడ ప్రతినిధి//మార్చి 18:(తెలంగాణ పత్రిక):-

జనాభాలో 60 శాతం పైగా ఉన్న బీసీలను అడుగడుగునా అవమానిస్తూ, ఆత్మగౌరవాన్ని, దెబ్బతీస్తు బీసీల ద్రోహిగా మారి, కులగజ్జితో వ్యవహరిస్తున్న రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మంత్రి పదవి నుండి తక్షణమే తొలగించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్  కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. నిన్న అసెంబ్లీ లాబీలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడిగా జగ్గారెడ్డి అయితే 100 సీట్లు గెలుస్తామని,పార్టీ రాష్ట్రంలో ఇంకా పుంజుకుంటుందనీ మాట్లాడడం చూస్తే బీసీలపై ఆయనకు బిసిల పట్ల పచ్చి వ్యతిరేకత ఉన్నట్లు స్పష్టం అవుతుందని లింగంగౌడ్ అన్నారు. ఆ విధంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడటాన్ని నిరసిస్తూ పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు.టీపిసిసి అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ నియమాకం జరిగిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన జరగడం, కాంగ్రెస్ పార్టీ పదవుల నియామకాలు 70శాతం బహుజనులకు కేటాయించడం, డిసిసి అధ్యక్షులు నియామకాలలో బీసీలకు ప్రాధాన్యత కల్పించడం, ఎమ్మెల్సీ పదవులలో బీసీ ఎస్సీ ఎస్టీ మహిళ కేటాయించడం నిన్న మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలలో బీసీలు పెద్ద ఎత్తున గెలవడంతో, ఇది జీర్ణించుకోలేని కోమటిరెడ్డి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను తొలగిస్తే రెడ్డి రాజ్యం కు



అడ్డు ఉండదని ఉద్దేశంతో కోమటిరెడ్డి బలుపెక్కిన మాటలు మాట్లాడుతున్నాడని లింగంగౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానశీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న మంత్రి కోమటిరెడ్డిని మంత్రి వర్గం నుండి తక్షణమే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు, దోనేటి శేఖర్, సత్య, ప్రకాష్, నాయుడు, సురేష్ యాదవ్, మురళీకృష్ణ, ప్రశాంత్, రవితేజ, హేమంత్, ఆర్యన్, తదితరులు పాల్గొన్నారు.

# ఈఎంఆర్ఎస్, గిరిజన ఆశ్రమ పారశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన, జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్



**- కొత్తగూడ ఏహెచ్ఎస్ విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్ఎం, వార్డెన్ల కు షోకాజ్ నోటీస్**

**- అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థలలో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయాలి**

పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:- మార్చి 18. (తెలంగాణ పత్రిక ప్రతినిధి):

మహబూబాబాద్ జిల్లా, బుధవారం రోజున, జిల్లా కలెక్టర్ కొత్తగూడ మండలం పోగులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పారశాల (బాలికలు)లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈఎంఆర్ఎస్ లోనీ తరగతి గదులు, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, స్టాక్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. పిల్లలకు పక్కాగా డైట్ మెనూ ప్రకారం ఆహారం అందించాలని, పిల్లల యొక్క మానసిక, ఆరోగ్య స్థితిగతులు గమనిస్తూ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, భోజనం సిద్ధం చేసే సిబ్బందికి తరచుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ తగిన జాగ్రత్తలు పాటించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కొత్తగూడ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పారశాల (బాలికలు) లో ప్రతి తరగతి గది, వసతి గృహంలో ని



రూములను, వంట సిద్ధం చేసే ప్రదేశం, డైనింగ్ హాల్, టాయిలెట్స్, డార్మెటరీలను తనిఖీ చేసి స్వయంగా విద్యార్థులతో మాట్లాడారు. పిల్లలకు పక్కాగా డైట్ మెనూ ప్రకారం బ్రేక్ ఫాస్ట్, భోజనం, డిన్నర్, స్నాక్స్ అందించాలని, నాణ్యమైన ఆహార పదార్థాలను వాడాలని, పిల్లలకు హెల్త్ ఎడ్యుకేషన్ లపై ప్రత్యేక దృష్టి పెట్టే విధంగా అవగాహన కల్పించాలని, ప్రతి విద్యా సంస్థలు, వసతి గృహాలలో పిల్లల ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేయాలని సూచించారు. తరగతి గదులు, డైనింగ్ హాల్, టాయిలెట్స్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మెనూ బోర్డును ఏర్పాటు చేయాలని, స్టాక్ రిజిస్టర్, అప్డేట్ చేసుకోవాలని, వంట నిమిత్తం ఎల్పిజి సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వసతి గృహం నిర్వహణ లో అలసత్వం వహించిన ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి, వార్డెన్ అనూష, లకు శోకాజు నోటీస్ జారీ చేయాల్సిందిగా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలలో పిల్లలకు అందించే విద్యా, బోధనలు ఆహార పదార్థాల పంపిణీలను నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపల్ గోవిందరావు, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో మునవర్ బేగ్, తదితరులు ఉన్నారు.

## బోధన్ పట్టణంలో హోటల్‌లో సబ్సిడీగ్యాస్ సిలిండర్లు పట్టివేత..



తెలంగాణ పత్రిక ప్రెస్ రిపోర్టర్ మోహన్ బోధన మండలం. మార్చి 18.

బోధన్ పట్టణంలోని హోటళ్లలో గురువారం సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల ను సివిల్ సప్లై అధికారులు మరియు రెవిన్యూ అధికారులు బస్టాండ్ సమీపంలోనీ ఫోటోలపై దాడి చేసి ఏడు సబ్సిడీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసు సిబ్బంది సహకారంతో హోటల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంగా ఈ సిలిండర్లు లభించాయి. బోధన్ టౌన్ ఆర్ ఐ. నాగేశ్వరరావు హనుమంతు బోధన్ టౌన్.ఏ ఎస్ఐ చిరంజీవి పోలీసుల సిబ్బంది తనిఖీ నిర్వహించారు.

## గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల పై ప్రభుత్వ మెమో రద్దు చేయాలి : సిఐటియు డిమాండ్



తెలంగాణ పత్రిక దమ్మపేట మార్చి 18

గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను గ్రామ పంచాయతీ నిధుల నుండి చెల్లించాలని నిర్ణయిస్తూ జారీ చేసిన మెమోను తక్షణమే రద్దు చేయాలని,బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో రవీంద్రరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ గతంలో కూడా పంచాయతీ కార్మికులకు గ్రామపంచాయతీ నిధుల నుండే వేతనాలు కేటాయించేవారని పంచాయతీలో నిధులు సరిపోని పరిస్థితిలో కార్మికుల జీతాలు ఆపే పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని కార్మికుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేస్తామని అందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మరలా గ్రామపంచాయతీల ద్వారానే వేతనాలు తీసుకోవాలని మెమో జారీ చేయటం దురదృష్టకరమైన అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా గ్రామపంచాయతీ దగ్గర కార్మికుల కాళ్లు మొక్కుబడి గాఎమ్మెల్యేలు కాళ్లు కడిగితే పంచాయతీ కార్మికుల కడుపు నిండదని వారికి ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని అన్నారు.ఎండల తీవ్ర త దృష్ట్యా కార్మికులకు ఒక్క పూట పని కల్పించాలని,కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు రామకృష్ణ మల్లేశ్వరి విజయలక్ష్మి భవాని యశోద తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు





జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక)18/03/26

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇఫ్తార్ విందు కార్యక్రమాలలో భాగంగా ఐజ మున్సిపాలిటీలోఈరోజు ఏఐసీసీ కార్యదర్శి మాజీ శాసనసభ్యులు డాక్టర్  సంపత్ కుమార్ ఆదేశానుసారం మేకల పేట నల్ల మసీదు నందు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందునకు  సింగిల్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి ,కౌన్సిలర్ ఎస్ మద్దిలేటి , సంతోషమ్మ మైనర్ బాబు, రాధాకృష్ణ ,యుగేందర్, మహబూబ్ బాషా ,మాజీ కౌన్సిలర్ కాజా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవేంద్ర, ఫిరోజ్ ,మాల మల్లికార్జున్, డాన్ వీరన్న, నంద్యాల శీను, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ షాలు, కాంగ్రెస్ పార్టీ యూత్ టౌన్ ప్రెసిడెంట్ డి సూర్యచంద్ర ,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కురువ విరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పసిపాప ప్రాణానికి భరోసా.. మానవత్వానికి నిలువుటద్దం రణధీర్ !"

- ఒక పసికందు ఊపిరి కోసం కొట్టుమిట్టాడుతుంటే
-ఒక కుటుంబం కన్నీటి సంద్రంలో మునిగిపోతుంటే.. 'నేనున్నానంటూ' ముందుకొచ్చింది ఒక లిఆపద్బాంధవుడి హృదయం.



పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:- మార్చి 18. (తెలంగాణ పత్రిక ప్రతినిధి):

మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం, బూర్గ గుంపు కు చెందిన మల్లెల మహేష్ - అశ్విని దంపతుల మూడు నెలల కుమార్తె పరిస్థితి వర్ణనాతీతం. ఊపిరితిత్తుల వ్యాధితో ఆ చిన్నారి పడుతున్న నరకం చూసి అమ్మానాన్నలు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. ఉన్నదంతా అమ్మి, చివరకు బిడ్డ ప్రాణాన్ని కాపాడుకోవడానికి దారి తెలీక అల్లాడిపోతున్న ఆ పేద కుటుంబానికి మల్లెల రణధీర్ ఒక ఆశాకిరణంలా కనిపించారు. మాజీ సర్పంచ్ -- జే ఎల్ ఎన్ వై సి యూత్ అధ్యక్షుడు అయిన మల్లెల రణధీర్ , ఆ పాప పరిస్థితి తెలుసుకుని చలించి పోయారు. మానవత్వమే మతం అని నమ్మే ఆయన, ఆ చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం 10,000 రూపాయల భారీ ఆర్థిక సాయాన్ని అందించి తన పెద్ద మనసును చాటుకున్నారు. కేవలం సాయం చేయడమే కాదు, 'ఆ పాపను బతికించుకోవడంలో మనమందరం తోడుండాలి. అని పిలుపునిచ్చి యువతకు ఆదర్శంగా నిలిచారు. రణధీర్ చూపిన ఈ ఉదారత. మృత్యువు అంచున ఉన్న ఆ పసిపాపకు కొంత ఊపిరి పోసింది. పదవిలో ఉన్నా లేకపోయినా, ప్రజా సేవలో తాను ఎప్పుడూ ముందే ఉంటానని, కొత్తగూడ మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్ మరోసారి నిరూపించారు.

## కొమ్మాల జాతరలో సైకిల్ స్టాండ్ దందా

- గడువు ముగిసిన నేటికి వసూళ్ల పర్వం.
- గ్రామ పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకునేనా.?
- పై అధికారుల సూచనల మేరకు పోలీస్ స్టేషన్ కార్యదర్శి పిర్యాదు.?





వరంగల్ జిల్లా తెలంగాణ పత్రిక, మార్చి 18,

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహా స్వామి జాతరకు వచ్చే భక్తుల వద్ద నుండి దళారీలు వివిధ రూపాల్లో నిలువుదోపిడికి పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతరకు వచ్చే భక్తుల నుండి సైకిల్ స్టాండ్ ఛార్జీల గడువు ఈ నెల 17వ తేదీ వరకు ముగిసింది. ఐనప్పటికీ గడువు ముగిసిన నేటికి వసూళ్ల పర్వం కొనసాగు తున్నది. గడువు ముగిసింది కదా ఎందుకు పార్కింగ్ పేరుతో వసూళ్లు చేస్తున్నారని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత సైకిల్ స్టాండ్ ఛార్జీల వసూళ్లు చేస్తున్నారని కొమ్మాల గ్రామ పంచాయతీ కార్యదర్శికి పిర్యాదు చేస్తే అక్కడ ఎలాంటి వసూళ్లు చేయడం లేదని తెలుపుతున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న వారికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని జాతరకు వచ్చే భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శంకర్ రావును వివరణ కోరగా భక్తుల పిర్యాదు మేరకు విచారణ చేయగా గడువు ముగిసిన తర్వాత కూడా సైకిల్ స్టాండ్ ఛార్జీల వసూళ్లు చేస్తున్నారని తేలిందని అన్నారు.ఈ నేపథ్యంలో మండల పంచాయతీ అధికారికి సమాచారం ఇవ్వగా పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చెయ్యమని తెలిపినట్లు కార్యదర్శి శంకర్ రావు వివరణ ఇచ్చారు.

## కాంగ్రెస్ పాలనలో రక్తం చిందిస్తున్న విద్యా కుసుమాలు అణిచివేతతో రాజ్యమేలుతున్న హస్తం సర్కార్

- చనిపోయిన మోడల్ స్కూల్ టీచర్ల గ్రాట్యుటీ ఎక్కడ
- విద్యార్థుల ప్రాణాలు తీస్తున్న ఫుడ్ పాయిజన్లు.
- అసెంబ్లీలో ఎమ్మెల్యేలపై అరాచకకాండపై 'బీఆర్ఎస్వీ' బి ఆర్ ఎస్ వి నేత తుప్పత్రల వీరేష్ గర్జన.

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక)18/03/26

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అన్ని వర్గాల ప్రజలను వంచిస్తోందని, ముఖ్యంగా విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని బీఆర్ఎస్వీ నాయకులు వీరేష్ తీవ్రంగా మండిపడ్డారు. నేడు అసెంబ్లీ వేదికగా మరియు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలపై ఆయన స్పందిస్తూ ధ్వజమెత్తారు.

### మోడల్ స్కూల్ టీచర్ల పట్ల నిర్దయ

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సీపీఎస్ కింద గ్రాట్యుటీ అందించాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని విస్మరిస్తోంది, చనిపోయిన 42 మంది టీచర్ల కుటుంబాలకు తక్షణమే గ్రాట్యుటీ చెల్లించాలి. వారి ఆవేదన ప్రభుత్వానికి వినిపించడం లేదా? నెలలో 17వ తేదీ వచ్చినా జీతాలు అందక ఉపాధ్యాయులు అల్లాడుతున్నారు. ఈ జాప్యం ప్రభుత్వ దివాలాకోరుతనానికి నిదర్శనం. ప్రభుత్వ ఉద్యోగులందరితో సమానంగా మోడల్ స్కూల్ సిబ్బందికి కూడా ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈ హ్ స్) వెంటనే వర్తింపజేయాలి. ఫుడ్ పాయిజన్లతో విద్యార్థుల బలి - రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లు నేడు మృత్యుకూపాలుగా మారాయి. వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల వల్ల విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారు. విద్యాశాఖ పై పర్యవేక్షణ సున్నా. విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్న ఈ దరిద్రపు కాంగ్రెస్ విధానాల వల్లే పేద విద్యార్థులు ఆసుపత్రి పాలవుతున్నారు...అసెంబ్లీ సాక్షిగా అరాచకం - హరీష్ రావు గారి పై దాడి రైతుల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై మార్షల్స్‌ను ప్రయోగించి భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్య. మాజీ మంత్రి హరీష్ రావు గారిని గాయపరిచి రక్తం చిందించడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు. మొక్కజొన్న రైతులకు మద్దతు ధర అడిగితే రక్తం చిందిస్తారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి, లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం మాడిపోక తప్పదు. ప్రజా తీర్పుతో గెలిచిన ఎమ్మెల్యే లను ప్రోటోకాల్ పాటించక కాంగ్రెస్ నాయకులవలె ప్రవర్తిస్తున్న అధికారులు మునుపెన్నడూ ఎరుగని విధంగా స్పీకర్ ఎమ్మెల్యేల పిర్యాదు చెయ్యాల్సిన పరిస్థితి.. అధికారులు కాంగ్రెస్ కండువాలు కప్పుకుకోండి.. ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న జోగులాంబ గద్వాల జిల్లా అధికార యంత్రాంగం కాంగ్రెస్ కక్ష్య సాధింపుతోనే అభివృద్ధి పనుల ఆగిపోయాయి, తీరు మార్చుకోవాలి లేదా ప్రజల నుండి ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుంది.. మూసీ పేరుతో లక్షన్నర కోట్ల దోపిడీ మూసీ నదిని మురికికూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని, ఇప్పుడు సుందరీకరణ పేరుతో రూ. 1.50 లక్షల కోట్ల భారీ కుంభకోణానికి కేటీఆర్ గారు చెప్పినట్లుగా తెరలేపారు. ఈ దోపిడీని బీఆర్ఎస్వీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. వెంటనే విద్యార్థుల మరణాలపై విచారణ జరిపించాలి, టీచర్ల సమస్యలు పరిష్కరించాలి. అణచివేత ధోరణి వీడకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే చరమగీతం పాడుతారు." అని వీరేష్ (బి ఆర్ ఎస్ వి నాయకులు) తెలిపారు.




## గ్యాస్ వినియోగదారులు నిబంధనలు పాటించాలి





-గృహ అవసరాలకు గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకునే వినియోగదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి (తెలంగాణపత్రిక)18/03/26

గ్యాస్ సిలిండర్ల కొరత, బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు అంటూ కొన్ని మీడియాల్లో వస్తున్న వార్తల నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర, ధనుష్ హెచ్.పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్యాస్ సిలిండర్ల సరఫరా పై అక్కడి యాజమాన్యంతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ బుకింగ్, సరఫరా ప్రక్రియలో ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనల ప్రకారం ప్రతి సిలిండర్ బుకింగ్‌కు మధ్య 45 రోజుల గ్యాప్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ గడువు పూర్తికాకముందు మళ్లీ బుకింగ్ చేయడానికి ప్రయత్నిస్తే ఓటిపి నంబర్ రాదని, కాబట్టి ప్రజలు అనవసరంగా గ్యాస్ ఏజెన్సీ కేంద్రాల వద్దకు రావద్దని సూచించారు. గృహ అవసరాలకు గ్యాస్ బుకింగ్ సంబంధించి గతంలో వచ్చిన మెసేజ్లో ఉన్న తదుపరి బుకింగ్ తేదీ చూసుకుని ఆ తేదీకి మాత్రమే బుకింగ్ చేయాలని, గ్యాస్ బుక్ చేసిన వారికి గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి నిర్దేశిత గ్యాస్ బుక్ లోని కన్స్యూమర్ నెంబర్ తో రిజిస్టర్ అయిన మొబైల్ నెంబర్ నుంచే వినియోగదారులకు ఓటిపి వస్తుందని, మొబైల్ నెంబర్ మార్పులు అనుమతించబడవని తెలిపారు. ఇది బ్లాక్ మార్కెటింగ్ నివారణ కోసం తీసుకున్న చర్యగా పేర్కొన్నారు. ప్రతి గ్యాస్ సిలిండర్‌కు ప్రత్యేక సీరియల్ నెంబర్ ఉంటుందని, సిలిండర్ దుర్వినియోగం లేదా ఇతరులకు మళ్లింపు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత వినియోగదారుడు మళ్లీ గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకున్నప్పుడు డెలివరీ సమయంలో ఇదివరకు ఇచ్చిన సిలిండర్ ను నంబర్ సరిచూసుకుని గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకునే వారిపై అవసరమైతే పోలీస్ కేసులు నమోదు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 11 ఏజెన్సీల పరిధిలో గృహ అవసరాలకు సంబంధించి 1,76,366 , వాణిజ్య అవసరాలకు సంబంధించి 907 గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు సుమారు 2815 గృహ అవసరాల గ్యాస్ బుకింగ్ లు జరుగుతున్నట్లు చెప్పారు. జిల్లాకు రోజుకు సుమారు 5000 గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయని, గ్యాస్ కొరత ఎక్కడా లేదని స్పష్టం చేశారు. ప్రజలు భవిష్యత్తులో గ్యాస్ కొరత రావచ్చేమోనని అనుమానాలతో ముందుగానే బుక్ చేసుకోవడం వలన ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు సిలిండర్ల కోసం బారులు తీరాల్సి వస్తుందని పేర్కొన్నారు. వినియోగదారులు అపోహలను వీడి అనవసరంగా భయపడకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయం లోనే గ్యాస్ సిలిండర్‌ల కోసం బుకింగ్ చేసుకోవాలని కలెక్టర్ కోరారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రదేశాల్లో సమగ్ర వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వినియోగదారులకు ప్రతి రోజు గ్యాస్ సిలిండర్ల సరఫరా, బుకింగ్స్, ఫిర్యాదులపై నివేదికలు సమర్పించాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ నది అగ్రహారం వద్ద ఉన్న ధనుష్ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ గోదామును సందర్శించారు. కేజీబీవీలు, గురుకులాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు సిలిండర్ల కొరత లేకుండా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్, ఆయా గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, తదితరులున్నారు.

## బడ్జెట్‌లో బిసిలకు 50శాతం కేటాయింపు

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండు బడ్జెట్‌లు అయిపోయాయని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ. 10 వేల కోట్ల వరకు ఉన్నాయని, వెంటనే వాటిని ప్రభుత్వం చెల్లించాలని కోరారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల కారణంగా అనేకమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే బీసీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు జ్యోతిరావు పూలే ఓవర్సీస్ కార్యక్రమాన్ని కేసీఆర్ తీసుకొచ్చారని, ఆ పథకం క్రింద అర్హులైన విద్యార్థులకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీ వర్గాలను చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీలో బిల్లు పెడితే చట్టబద్దత రాదని, కేంద్ర ప్రభుత్వం 9 వ షెడ్యూల్ లో చేరిస్తేనే చట్టబద్దత వస్తుందన్న విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తే పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు హాజరుకాకపోవడం బీసీల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. బీసీ సమస్యల పై కాంగ్రెస్ పార్టీలోని బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

## యూరియా యాప్‌తో రైతులకు నానా యాతన

-మొదటిపేజీ తరువాయి

ఇక స్మార్ట్ ఫోన్‌లు ఉన్న 50 శాతం మందిలో కూడా 50 శాతం మందికి యాప్‌ను ఎలా ఉపయోగించాలో తెలియదని అన్నారు. ఇలా మొత్తంగా 75 శాతం మంది రైతులు యూరియా యాప్‌తో ఇబ్బందులు పడుతున్నారని వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. వారంతా మీ సేవా కేంద్రాలకు పోయి యూరియా బుక్ చేయించుకోవాల్సి వస్తున్నదని తెలిపారు. ఆ తర్వాత మరో రోజు వెళ్లి యూరియా తెచ్చుకోవాల్సి వస్తుందని అన్నారు. ఇలా రెండు రోజులు సమయం రైతుకు వృథా అవుతున్నదని చెప్పారు. ఇక ఒక దఫాలో 5 బస్తాల కంటే ఎక్కువ యూరియా ఇవ్వడంలేదని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. దాంతో మూడు నాలుగు ఎకరాల్లో మక్క పంట వేసిన రైతు మూడు దఫాల్లో రెండేసి రోజుల చొప్పున మొత్తం ఆరు రోజులు యూరియా కోసం తిరగాల్సి వస్తున్నదని చెప్పారు. మండలానికి ఒక్క కేంద్రంలో మాత్రమే యురియా ఇస్తుండటంతో చాలా గ్రామాల రైతులు ఎక్కువ దూరం వెళ్లాల్సి వస్తుందని అన్నారు. కాబట్టి మండలానికి ఒక్కచోట మాత్రమే కాకుండా ఎక్కువచోట్ల యూరియా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. దఫాకు 5 బస్తాల పరిమితిని ఎత్తేసి, రైతు వేసిన పంటకు ఎంత యూరియా అవసరమో అంతా ఒకేసారి ఇవ్వాలన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143